అమరజీవి త్యాగం అజరామరం


పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (సాంస్కృతికం/క్రైం) : తెలుగు వారి ఆత్మగౌరవం కోసం అమరణ నిరాహారదీక్ష తీసి ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు త్యాగం అజరామరమని కలెక్టర్ ఎం.హరినారాయణన్ కొనియాడారు. శనివారం పొట్టిశ్రీరాములు 124వ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు అమరజీవి విగ్రహాలకు, చిత్రపటాలకు పుష్ప మాలలు వేసి నివాళులు అర్పించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పుష్పమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం నేటి యువతకు స్ఫూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపుఎస్పీ సీహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.




ఉచితంగా ఆధార్ అప్‌డేట్

● జూన్ 14 వరకు అవకాశం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 16 : ప్రతి విషయానికి ఆధార్ కార్డు అనేది తప్పనిసరి అయ్యింది. ఎప్పుడో పదేళ్లనాడు తీసుకున్న ఆధార్ కార్డు చెల్ల కుండా పోయే అవకాశం త్వరలో ఏర్పడే అవకాశం ఉంది. ఇలాంటి కార్డుల అప్‌డేట్ కోసం ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నెల 14వ తేదీతో ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశం ముగిసింది. అయితే, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ ఉచిత అప్‌డేట్ అవకాశాన్ని మరోమారు పొడిగించింది. జూన్ 14వ తేదీ వరకు అప్‌డేట్ చేసుకోవచ్చు. 2014కు ముందు ఆధార్ కార్డును పొందిన వారు తప్పని సరిగా అడ్రసును, గుర్తింపును నవీకరించుకోవాల్సి ఉంది. ఈ నవీకరణ కోసం ఓటరు కార్డు, పాస్‌బుక్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు తదితరాలను వినియోగించవచ్చు. ఈ అప్‌డేట్ ప్రక్రియను యూఐడీఏఐ పోర్టల్‌లో మాత్రమే చేసుకోవాలి.

మార్చిలోనే మండుటెండలు !



నెల్లూరు (వైద్యం), మార్చి 16 : మార్చిలోనే భానుడు భగభగ మండిపోతు న్నాడు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు నమోదవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాబోవు రోజుల్లో ఎండ మరింత ఉండబోతుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్ని వర్గాల్లో గుబులు మొద లైంది. ఉదయం 11 గంటలపైన వృద్ధులు, చిన్నారులు, మహిళలు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. వేసవి తీవ్రత వల్ల చమట రూపంలో రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. మహిళల్లో రోగ నిరోధక శక్తి కూడా తక్కువగా ఉండడంతో చర్మవ్యాధులతోపాటు తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్రసంబంధిత వ్యాధులు, మతిభ్రమణం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తు న్నారు. వడగాలులు, డీహైడ్రేషన్, వడదెబ్బ, నీటి కాలుష్యం వల్ల వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు ఇతర వ్యాధులు మనిషి మనుగడకు సవాలుగా మారనున్నాయి. అయితే కాస్త ముందుచూపుతో వ్యవహరిస్తే ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
16	35.0	25.4
15	36.0	26.9
14	36.5	25.0
13	36.3	25.0
12	33.7	25.02
11	34.5	26.0
10	35.8	26.02

నేడు ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్ష

నెల్లూరు (హరనాథపురం) : ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్ష ఆదివారం జిల్లావ్యాప్తంగా జరగనుంది. 13 కేంద్రాల్లో జరిగే పరీక్షకు 6,954 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్టుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పని సరిగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించరు. ఈ పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహ నివృత్తి కోసం కలెక్టరేట్‌లో 0861-2331261 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : 6.25
సహరి (సోమవారం) : 4.53


మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు పరిశీలకుడు బహుగుణ

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

● నెల్లూరులోని కేఏసీ కళాశాలలో నిర్వహణ

నెల్లూరు (విద్య), మార్చి 16 : ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, సోమవారం నుంచి నాలుగు విడతలుగా స్పాట్‌ను పూర్తి చేస్తామని ఇంటర్‌బోర్డు పరిశీలకులు డాక్టర్ ఎస్. బహుగుణ తెలిపారు. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌బోర్డు అధికారులు, కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. స్పాట్ కేంద్రాల్లోనే స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా ఇంటర్‌బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ శ్రీకారం చుట్టారన్నారు. దీనికి సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది సహకరించి స్పాట్‌ను విజయవంతం చేయాలని తెలిపారు. ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ కేఏసీ కళాశాలలో ప్రారంభం కానున్న మూల్యాంకనానికి ఇంటర్‌బోర్డు నియమించిన లెక్చరర్లను తప్పనిసరిగా యాజమాన్యాలు రిలీవ్ చేయాలన్నారు. లెక్చరర్స్‌ను పంపని ప్రిన్సిపాళ్లకు రోజుకు రూ.వెయ్యి అపరాధ రుసుము చెల్లించాలని, అవసరమైతే కళాశాల అనుమతులు కూడా రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహించినా, హాస్టళ్లు నడిపినా, అడ్మిషన్లు చేపట్టినా సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఓటర్ హెల్ప్‌లైన్ ఏర్పాటు



సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని ఓటర్లకు సహాయం కోసం ప్రత్యేక కాల్ సెంటర్‌ను నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సహాయానికైనా లేదా ఫిర్యాదులకైనా ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్ 1950తోపాటు కాల్ సెంటర్ నంబర్లు 0861-2349402, 0861-2349403, 0861-2349404 నంబర్లను సంప్రదించవచ్చునని ఆయన వెల్లడించారు.

● 'స్పందన' రద్దు




ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఈ కార్యక్రమం జరగదని, ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించి, ఎవరూ స్పందనలో అర్జీలు ఇచ్చేందుకు రావద్దని సూచించారు.

● ఊపిరి పీల్చుకున్న కావలి

కావలి : ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో కావలిలో అధికారులంతా ఊపిరిపీల్చుకున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక వారి మట కాదంటే తమ కుర్చీలు కదులుతాయోనన్న భయంతో నిన్నటిదాకా తలూపారు. ఇంత జరుగు తున్నా జిల్లా ఉన్నతాధికారులు సైతం చూస్తూ ఉండిపోయారు. అయితే ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడి కోడ్ అమలులోకి రావడంతో అధికారులు ఆనందంలో మునిగిపోయారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇకనైనా అధికారులు న్యాయంగా, ధర్మంగా వ్యవహరిస్తారా!? లేదా ఇంకా అధికారపార్టీ పాత వాసనతో వారికి అనుకూలంగా కొంత కాలం వ్యవహరిస్తారా!? అనే అనుమానాలను కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు.

ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల | 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ | 26వ తేదీన నామినేషన్ల పరిశీలన | 29వ తేదీ వరకు ఉపసంహరణ | మే 13న ఓట్ల లెక్కింపు

58 వ రోజు ఓట్ల పండుగ



ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యింది. నేటి నుంచి సరిగ్గా 58వ రోజు ఓట్ల పండుగకు ముహూర్తం ఖరారయ్యింది. మే 13వ తేదీన కొత్త రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నుకునే క్రమంలో జిల్లావాసులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల బరిలోని అభ్యర్థుల తలరాతలు రాయనున్నారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా పోటీ చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ వామపక్షాల పొత్తుతో ముందుకు వెళుతోంది. వైసీపీ మాత్రం ఒంటరిగా బరిలోకి దిగుతోంది. ఏదిఏమైనా సుదీర్ఘకాలంపాటు ఎన్నికల ప్రక్రియ జరగనుండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులకు వ్యయం తడిసి మోపెడు కానుంది.

● మోగిన నగారా
● షెడ్యూలు విడుదల చేసిన ఎన్నికల సంఘం
● మే 13న పోలింగ్... జూన్ 4న కౌంటింగ్
● తడిసి మోపెడవనున్న అభ్యర్థుల ఖర్చు

నెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : 2019 ఎన్నికల తరహాలోనే రాష్ట్ర ఎన్నికలు తొలివిడతలోనే జరుగుతాయన్న అంచనాతో ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించాయి. తెలుగుదేశం-జనసేన-బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. ఒక్క సర్వేపల్లి మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలతోపాటు నెల్లూరు ఎంపీ అభ్యర్థి పేరును టీడీపీ ప్రకటించింది. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరికి కాకర్ల సురేష్, ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డి, కోవూరుకు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలికి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు సిటీకి పొంగూరు నారాయణ, రూరల్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బరిలో నిఇచారు. నెల్లూరు జిల్లా పరిధిలో ఉంటూ తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్‌లోని సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి పేరును మాత్రం ఇంకా ప్రకటించాల్సి ఉంది.

● వైసీపీ అభ్యర్థుల ఖరారు

శనివారం సాయంత్రానికి వైసీపీ కూడా నెల్లూరు జిల్లా పరిధిలోని 8 అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులుగా కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, ఉదయగిరికి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరుకు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కావలికి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోవూరుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, నెల్లూరు సిటీకి మహ్మద్ ఖలీల్, నెల్లూరు రూరల్‌కు ఆదాల ప్రభాకరరెడ్డి, సర్వేపల్లికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్లను ప్రకటించింది. కాగా, వామపక్షాల పొత్తుతో బరిలోకి దిగుతున్న కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు.

● సుదీర్ఘ ప్రచార కాలం

2019 ఎన్నికల్లో మార్చి 10వ తేదీన షెడ్యూల్ విడుదలయ్యింది. ఏప్రిల్ 11న పోలింగ్ జరిగింది. మొత్తం నెల రోజుల వ్యవధిలోనే ప్రచారాలు, పోలింగ్ ఘట్టాలు అన్నీ ముగిసిపోయాయి. అయితే, ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల తరహాలోనే ఏప్రిల్‌లోనే పోలింగ్ ఉంటుందనే అంచనాతో ప్రధాన పార్టీలు నెల రోజులకు ముందు నుంచే ప్రచారాన్ని మొదలుపెట్టాయి. అయితే ఈదఫా నాల్గవ విడతలో ఎన్నికలు జరగనుండటంతో ప్రచారానికి, పోలింగ్‌కు ఇంకా 58 రోజుల కాలం ఉంది.

● రెట్టింపు కానున్న వ్యయం

పోలింగ్‌కు 58 రోజుల వరకు సమయం ఉండటం అభ్యర్థులకు ఒకవైపు మేలు చేసినా ఎన్నికల ఖర్చు కోణంలో చూస్తే మాత్రం ఇబ్బందికర పరిస్థితిగా మారనుంది. ఇప్పుడు రాజకీయాలు, అందునా ఎన్నికలు ఎంత ఖరీదైనవో ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నికల కమిషన్ ఎన్ని ఆంక్షలు విధించినా, ఎంత నిఘా పెట్టినా పెట్టాల్సిన ఖర్చు పెట్టకతప్పని పరిస్థితి. 58 రోజుల సుదీర్ఘ కాలం ప్రచార టెంపోను నిర్వహించడం అంటే మాటలు కాదు. కరపత్రాలు పంచడం నుంచి పంచాయతీల వరకు ప్రతి దానికి ఖర్చు భారీగానే అవుతుంది. సుమారు రెండు నెలల పాటు పార్టీ కార్యాలయాల నిర్వహణ, కార్యకర్తల విందు, మందు, ప్రచార వాహనాల అద్దెలు, బహిరంగ సభల ఖర్చులు ఇలా ఎంత లేదన్నా రోజువారి లక్షల్లో ఖర్చు అవుతుంది. వ్యయభారం చూసి ఇప్పటికే మొదలుపెట్టిన ప్రచారాన్ని వాయిదా వేసుకోవడానికి వీలులేదు. ఒక్కరోజు కూడా వెనక్కు తగ్గడానికి వీలులేదు. ఇక పోలింగ్‌కు రెండు మూడు రోజులకు ముందు చేయాల్సిన ప్రలోభాలు ఎలాగూ తప్పవు. ఇవన్నీ కలుపుకుంటే అభ్యర్థుల ఎన్నికల వ్యయభారం తడిసిమోపెడవటం ఖాయం. ప్రచారానికి సమయం పెరిగిందనే సంబరం ఒకవైపు ఉన్నా, ఎన్నికల బడ్జెట్ పెరగుతుందనే ఆందోళన అభ్యర్థుల్లో కనిపిస్తోంది.

'కోడ్' కూసింది!

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ప్రకటించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎన్నిల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలులో భాగంగా ఏమేమి చేయకూడదోనన్న మార్గదర్శకాలను ఎన్నికల సంఘం జారీ చేసింది. అందులో ప్రధాన అంశాలను పరిశీలిస్తే..

● ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగ్‌లు, గోడలపై రాతలు, పార్టీ జెండాలను 24 గంటల్లోపు తొలగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిధులు వెచ్చించి రాజకీయ నాయకుల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించాల్సి ఉంది. ● బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రైల్వే బ్రిడ్జిలు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాలు, ఇతరత్రాలను 48 గంటల్లోగా తొలగించాలి. ● రాజకీయ ప్రచారాల్లో పాల్గొనే మంత్రులు, ఎమ్మెల్యేలు వారి అధికారిక వాహనాలను ఉపయోగించకూడదు. వారు ప్రభుత్వ అతిథి గృహాల్లో ఉండటానికి వీల్లేదు. పైలట్ కార్లు ఉనికి తెలిపేలా హారన్లు మోగించకూడదు. ప్రభుత్వ అధికారి వెబ్‌సైట్లలో ఉన్న మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలి. ● ప్రభుత్వ ఉద్యోగులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఏ రాజకీయ పార్టీకి గానీ లేక అభ్యర్థికి గానీ అనుకూలంగా వ్యవహరించడం లేక సందేశాలు పంపడం చేయకూడదు. రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ప్రజలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తే చట్ట ప్రకారం ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు. ● ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సహా ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలి. ● మంత్రులు, రాజకీయ నాయకులు ఎవరూ అధికారులు, ఉద్యోగులతో వ్యక్తిగతంగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించకూడదు. ● వివిధ పథకాల లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్డుల్లోనూ, అధికారికంగా ఇచ్చే సర్టిఫికెట్లు, బిల్లుల్లోనూ, శిలాఫలకాల్లోనూ ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు, సందేశాలు ప్రచురించ కూడదు. ● ఎంపీ, ఎమ్మెల్యే ల్యాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకలు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలపై ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు కనిపంచకుండా ముసుగు వేయాలి. ● అభివృద్ధి, నిర్మాణ ప్రాజెక్టులతో సంబంధమున్న ప్రభుత్వ శాఖలు వాటి పరిధిలో ఇప్పటికే మొదలైన, మొదలుపెట్టాల్సిన పనుల వివరాలను 72 గంటల్లోపు ఎన్నికల సంఘానికి అందజేయాలి.

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి!

● వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్
● అదే నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
● సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కలెక్టర్

నెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్ కోరారు. రాజకీయ నాయకులు, ప్రజలు నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలతో కూడా సమావేశాలు నిర్వహించి ఎన్నికల నిబంధనలు తెలియజేస్తామని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెల్లడించారు. ఏప్రిల్ 18వ తేదీన జిల్లాలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేస్తారని చెప్పారు. శనివారం నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు ఆయన ప్రకటించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రానున్న 72 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, వారికి సంబంధించిన ఇతర అంశాలను తొలగిస్తామని తెలిపారు. వీధుల్లో ఉన్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తొలగించడంతోపాటు ప్రైవేటు భవనాలపై ఉన్న రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలను కూడా తొలగిస్తామని పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల కోడ్)ను జిల్లాలో పటిష్ఠంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అందుకుగానూ 53 ఎంసీసీ బృందాలు, 78 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 81 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు, 21 వీడియో సర్వేలెన్స్ బృందాలను నియమించామని, ఆ బృందాలు మూడు షిఫ్టులలో పని చేస్తాయని తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ బృందాల వాహనాలను జీపీఎస్‌తో అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



● అభ్యర్థుల ఖర్చుపై నిఘా

అభ్యర్థుల ఖర్చుపై పూర్తిస్థాయిలో దృష్టి పెడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు రాజకీయపరమైన ప్రింటింగ్‌లపై వాటిని ముద్రించిన వారి పేర్లను కూడా ముద్రించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాల్లో ఇచ్చే ప్రకటనలకు సంబంధించి ప్రీసెన్సార్ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లు తమ ఓటును ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పరిశీలించుకోవచ్చని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదునైనా పౌరులు సీ-విజిల్ యాప్ ద్వారా నమోదు చేయవచ్చని తెలియజేశారు. పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలను ప్రజలు నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. శనివారం వరకు వచ్చిన ఫారం-7 దరఖాస్తులను పరిష్కరించామని, ఇకపై ఆ దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. ఫారం-6 దరఖాస్తులను మాత్రం నామిషన్ల సమయం వరకు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

● ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 2463 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, వెయ్యి కన్నా ఎక్కువ ఓట్లున్న పది చోట్ల(నెల్లూరు రూరల్‌లో) ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 20,39,215 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 9,97,908 మంది, మహిళలు 10,41,096 మంది, ఇతరులు 211 మంది ఉన్నారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు తమ బయోడేటాను అఫిడవిట్ రూపంలో ప్రచురించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రచారాల్లో రాజకీయ నాయకులు సరైన భాష ఉపయోగించాలని, లేనిపక్షంలో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని సూచించారు.

పది పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

● విద్యా శాఖ జేడీ రామలింగం


మాట్లాడుతున్న రామలింగం

నెల్లూరు (విద్య), మార్చి 16 : జిల్లాలో పది పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. పరీక్షల నిర్వహణపై శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో విద్యా శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పది పరీక్షలకు సంబంధించి విధులకు హాజరయ్యే సిబ్బంది వారికి అందచేసిన బుక్‌లెట్‌ను అనుసరించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదని అన్నారు. ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులకు గురవుతారన్నారు. జిల్లావ్యాప్తంగా 176 కేంద్రాల్లో రెగ్యులర్ 28,080 మంది, ప్రైవేట్ 4,666 మంది మొత్తం 34,708 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. అలాగే 630 ప్రభుత్వ పాఠశాలల నుంచి 14,059 మంది బాలురు, 14,021 మంది బాలికలు పరీక్షలకు సన్నద్ధమయ్యారన్నారు. వీరితోపాటు 440 ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,700 మంది బాలురు, 1,966 మంది బాలికలు హాజరవుతు న్నారన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు 10 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారని, వీరంతా కోఆర్డినేషన్ కమిటీ సభ్యుల సమన్వ యంతో పరీక్షలను నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావర ణంలో పరీక్షలు రాసేలా వారిని సంసిద్ధం చేయాలన్నారు. పోలీస్ శాఖ ద్వారా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అలాగే జెరాక్స్ కేంద్రాలను మూసివేయడంతో పాటు కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా, తాగునీరు, వైద్య సదుపాయలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులను విద్యార్థులను గంట ముందు గానే కేంద్రాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ రామారావు, డిప్యూటీ ఈఓ లక్ష్మీ ప్రసన్నకుమారి, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తొమ్మిది పోయి..

ఏడొచ్చాయే!

- వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమయం కుదింపు
- పంటలు కాపాడుకునేందుకు రైతుల అవస్థలు



పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కొండాపురం, మార్చి 16 : వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదు. అసలే వర్షాలులేక మోటార్ల కింద వ్యవసాయం సాగుచేసుకుందామంటే అరకొర కరెంటుతో ఏం చేయాలో దిక్కుతెలియని స్థితిలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం 7గంటలు మాత్రమే పంపుసెట్లకు విద్యుత్ ఇస్తున్నారు. కొండాపురం మండలంలోని నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో సుమారు 3వేల వరకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. రైతులు బోర్లు వేసుకొని మోటార్లు బిగించి భూములు సాగుచేస్తున్నారు. గతంలో 9 గంటలు విద్యుత్ ఇస్తుండగా వరి, మిరప, పత్తి తదితర పంటలను సాగుచేసేవారు. నాలుగైదు నెలల నుంచి 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇటీవల ఒక నెల 9 గంటలు విద్యుత్ సరఫరా చేసినా తిరిగి 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో తాము పంటలు సాగుచేయాలంటే నీరు సక్రమంగా అందించలేమోనని రైతులు వెనకడుగు వేయాల్సి వస్తోంది. మండలాన్ని ఆనుకొని ఉన్న లింగసముద్రం, గుడ్లూరు తదితర మండలాల్లో 9 గంటలు విద్యుత్ వస్తుండగా, తమకు మాత్రమే ఇలా ఎందుకు 7 గంటలు ఇస్తున్నారని విద్యుత్ శాఖ అధికారులను కలసి వారు ప్రశ్నించారు. అయినా వారు పట్టించుకోలేదు. ఈవిషయంపై పాలకులు పట్టించుకోవాలని రైతులు అంటున్నారు.

త్వరలో 9 గంటలు ఇస్తాం

ఎస్పీడీసీఎల్ కంపెనీలో నెల కొన్న సమస్య వల్ల ఈ పరిస్థితి నెలకొంది. కంపెనీ పరిధిలోని నాలుగు జిల్లాల్లో ఇదే సమస్య ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వీలైనంతవరకు త్వరలో వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్‌ను ఇస్తాం.

\- దినేష్, ఇన్‌చార్జి, ఏఈ, కొండాపురం

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు రథం సిద్ధం



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన రథం

బిట్రగుంట, మార్చి 16: బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రథం సిద్ధమైంది. గత ఏడాది బ్రహ్మోత్సవాల్లో ప్రమాదవశాత్తు రథం పడిపోయి,కొంతభాగం దెబ్బ తింది. దీంతో ఈనెల 19 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల్లో స్వామి,అమ్మవార్లకు రథోత్సవం జరగదేమో అనే సందేహంలో భక్తులు ఉండిపోయారు. ఎట్టకేలకు శనివారం నాటికి రథం సిద్ధం కావడంతో భక్తులు ఆనందపరవశులయ్యారు. కాగా ఆదివారం ఉదయం 9 గంటలకు సంప్రోక్షణ, ట్రయిల్ రన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు.

ఫ్లెక్సీలతో పొంచి ఉన్న ప్రమాదం



ప్రధాన పోస్టాఫీసు ముందు రోడ్డుపై పడి ఉన్న ఫ్లెక్సీ

కావలిలో రాజకీయ పార్టీల కార్యకర్తలు ఇష్టానుసారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవటంలేదు. ట్రంకురోడ్డులోని ప్రధాన పోస్టాఫీసు ముందు శనివారం ఉదయాన్నే ఓ ఫ్లెక్సీ విరిగి రోడ్డుపై పడింది. దాన్ని తొలగించే వరకు ప్రజలు ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు పూర్తిగా తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

\- కావలి

లోక్ అదాలత్‌లో జిల్లా ప్రథమం

- 1, 859 కేసుల పరిష్కారం



బాధితురాలికి పరిహారపు చెక్కు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి యామిని

నెల్లూరు (లీగల్) : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించి నెల్లూరు జిల్లా ప్రథమ స్థానం సాధించింది. జిల్లా ప్రధాన న్యాయాధికారి సి.యామిని ప్రత్యేక చొరవతో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో ఎక్కువ కేసులు రాజీ మార్గంలో సహృద్భావ వాతావరణంలో పరిష్కరింపబడ్డాయి. నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న లోక్ అదాలత్ భవన్‌లో శనివారం ఉదయం జాతీయ లోక్‌అదాలత్‌ను యామిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని సాధ్యమైనంత వరకు సహృద్భావ వాతావరణంలో కేసులు రాజీ చేసుకుంటే ఇరు వర్గాలకు ఎంతో మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు జి.కబర్ది, తేజోవతి, కె.శ్రీనివాసరావు, యస్.సరస్వతి, సిరిపిరెడ్డి సుమ, బి.లక్ష్మీనారాయణ, యస్.శ్రీనివాస్, యస్.లావణ్య, టి.భాస్కర్, టి.సుయోధన్ పీసపాటి భరద్వాజ, యల్.శారదారెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1859 కేసులు పరిష్కరింపబడ్డాయి. రూ.9,88,41, 687 పరిహారం కింద కక్షిదారులకు చెల్లించారు. నెల్లూరులో 1267 కేసులు, గూడూరులో 81, కోవూరులో 77, కావలిలో 89, వెంకటగిరిలో 118, కోటలో 36, నాయుడుపేటలో 19, సూళ్లూరుపేటలో 40, ఆత్మకూరులో 54, ఉదయగిరిలో 78 కేసులు పరిష్కరింపబడ్డాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6247
వెండి కిలో ధర	రూ. 76,700
వెండి ఒక గ్రాము	రూ. 78.70

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

బిట్రగుంట, మార్చి 16: బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని ఎల్సీ గేట్ 144 వద్ద రైలు ఢీకొని శనివారం రాత్రి వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు, తాళ్లూరు పంచాయతీకి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు (60) పొలంలో పని చేస్తుండగా చేతికి గాయమైంది. చికిత్స కోసం బోగోలులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకుని తిరిగి వెళుతుండగా యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. రైలు వేగంగా వెళుతుండడంతో మృతదేహం దూరంగా పడి చెల్లాచెదరైంది. రైల్వే అధికారుల ద్వారా సమాచారం తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కావలి జీఆర్పీ ఎస్సై అరుణకుమారి తెలిపారు.

పక్కా మోసం..!

- కలగానే పేదల గూడు
- లేఅవుట్లలో సాగని ఇళ్ల నిర్మాణం
- 63,135 గృహాలకు పూర్తయింది.. 8805 మాత్రమే!
- ఇళ్లివ్వలేక రిజిస్ట్రేషన్ పేరుతో హడావిడి



సీతారామపురం మండలం పోలంగారిపల్లెలో అక్కడక్కడా బేస్‌మెంట్‌కే పరిమితమైన ఇళ్లు

నెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.. అదిగో స్థలం.. ఇవిగో ఇళ్లు అంటూ ఐదేళ్లు హడావిడి చేశారు.. పేరుకు మాత్రం వేల మందికి స్థలాలిచ్చామని చెప్పుకున్నారు.. కానీ అందులో ఐదో వంతు మందికి కూడా సొంత గూడు నిర్మించి ఇవ్వలేకపోయారు.. దీనిపై పేదల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండటంతో దానిని నుంచి తప్పించుకునేందుకు ఇప్పుడు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ అంటూ సందడి చేస్తున్నారు. హౌసింగ్ లెక్కలను చూస్తే జిల్లాలో పేదల ఇళ్ల పథకం ఎంతలా అబాసుపాలైందో అర్థమవుతుంది.

పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రారంభించి ప్రతి గ్రామంలో జగనన్న లేఅవుట్లు వేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో ప్రారంభమైన ఈ పథకం, ప్రభుత్వ పదవీ కాలం పూర్తవుతున్నా పేదలకు మాత్రం సొంతింటిని అందించలేకపోయింది. లేఅవుట్లకు భూముల కొనుగోళ్లలోనే భారీ అవినీతి జరిగింది. తక్కువ ధర ఉన్న భూములను కూడా భారీ ధరకు కొనుగోలు చేశారు. వైసీపీ నాయకులకు దోచిపెట్టేందుకే పేదల పేరుతో పథకాన్ని రూపొందించారని ఆది నుంచీ ఆరోపణలున్నాయి. పోనీ ఆ లేఅవుట్లలోనైనా పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చారా.. అంటే అదీ లేదు. జిల్లాకు మొత్తం 83,286 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో లేఅవుట్లలో నిర్మించే ఇళ్లు 63,135 కాగా, సొంత స్థలాల్లో నిర్మించుకునే ఇళ్లు 20,151 ఉన్నాయి. లేఅవుట్లలో నిర్మాణానికి మంజూరైన ఇళ్లలో ఇప్పటి వరకు 923 ఇళ్లను అసలు ప్రారంభించలేదు. ఇక 39,865 ఇళ్లు బేస్ లెవల్, అంతకన్నా తక్కువ స్థితిలో ఉన్నాయి. ఈ లెక్కన చూసుకుంటే దాదాపు 65 శాతం ఇళ్లు బేస్ లెవల్ దాటలేదు. ఇప్పటి వరకు 8805 ఇళ్లు పూర్తికాగా మరో 9034 ఇళ్లు రూఫ్ కాంక్రీట్(శ్లాబ్ వేసే స్థాయి)లో నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి కోసం ఇప్పటి వరకు 478.29 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అయితే పూర్తయిన ఇళ్లు కూడా చాలా వరకు నాసిరకంగా ఉండటంతో పేదలు ఆ ఇళ్లలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో భారీ అవినీతి జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సొంత స్థలాల పేరుతో దోపిడీ

ఇక సొంత స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు జిల్లాకు 20,151 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 754 ఇళ్ల నిర్మాణాలను ఇంత వరకు ప్రారంభించలేదు. మరో 6,393 ఇళ్లు బేస్ లెవల్, అంతకన్నా దిగువ దశలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 10,031 ఇళ్లు పూర్తవగా, మరో 1871 ఇళ్లు రూఫ్ కాంక్రీట్ దశలో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ ఇళ్ల నిర్మాణాల కోసం ఇప్పటి వరకు రూ.219.40 కోట్లను చెల్లించారు. అయితే ఇక్కడ కూడా భారీ అక్రమాలు జరిగాయి. చాలా చోట్ల ఇళ్లు నిర్మించకుండానే నిర్మించినట్లు బిల్లులు డ్రా చేసి తినేశారు. వైసీపీ నేతలు, వారి అనుచరులు ఈ పథకం ద్వారా భారీగా లబ్ధిపొందినట్లు ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం జరిగే సమయంలో ప్రతి ఇంటిని జియో ట్యాగ్ చేయాలి. ప్రతి దశలోనూ ఇంటి నిర్మాణాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. కానీ కొన్ని వేల ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమేకాలేదు. ప్రారంభంకాని దశ నుంచి ఇళ్లు పూర్తయిన దశ వరకు ఎప్పుడో కట్టిన ఇంటి ఫొటోనే అప్‌లోడ్ చేశారు. హౌసింగ్ సిబ్బంది, వైసీపీ నాయకులు ప్రజాధనాన్ని పంచుకున్నారు. మరీ ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇటీవల ఈ తరహా దందా ఎక్కువైపోయింది. ఇటువంటి అక్రమాలపై ఆధారాలతో అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకునేనాథుడు కరువయ్యాడు. మొత్తంగా పేదలందరికీ ఇళ్ల పథకం ఫలితాలు చూసుకుంటే లేఅవుట్లలో ఏమో ఇళ్ల నిర్మాణం జరగడం లేదు.. సొంత స్థలాల పేరుతో ఏమో ఇళ్లు పూర్తి చేసినట్లు బిల్లులు చేసుకుంటున్నారు. మధ్యలో గూడు లేని పేదలే కష్టాలు పడుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం పై రెండు విధానాల్లో మొత్తంగా జిల్లాలో 18,836 ఇళ్లను పూర్తి చేయగా, అందుకు ఇప్పటి వరకు 697.69 కోట్లను ఖర్చు చేయడం కొసమెరుపు.

రెవెన్యూ ఉన్నతాధికారి

వీరంగం..!

- నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయంలో హల్‌చల్
- బూతులతో సిబ్బందిపై తిట్ల పురాణం?
- రెవెన్యూ అసోసియేషన్ ఆగ్రహం.. అధికారితో చర్చలు

నెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రెవెన్యూ డివిజన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయంలో వీరంగం సృష్టించినట్లు తెలిసింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకున్న సదరు అధికారి రెవెన్యూ సిబ్బందిపై బూతులతో తిట్ల పురాణం అందుకున్నట్లు రెవెన్యూ వర్గాలు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో ఎదురు తిరిగిన తహసీల్దారు కార్యాలయ సిబ్బంది సదరు అధికారితో వాగ్వివాదానికి దిగినట్లు సమాచారం. దీంతో అర్ధరాత్రి తహసీల్దారు కార్యాలయంలో గందరగోళం నెలకొంది. అసలు ఆ సమయంలో తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది ఏం చేస్తున్నారు..? అక్కడికి సదరు అధికారి ఎందుకు వెళ్లారు..? ఏ కారణంతో సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు..? అన్నది ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారి తీరు గత కొంతకాలంగా విమర్శల పాలవుతోంది. కిందిస్థాయి సిబ్బందితో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆ అధికారి కార్యాలయంలోనే సిబ్బంది గ్రూపులుగా ఏర్పడి వివాదాలకు దిగుతున్నట్లు రెవెన్యూలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఈ అధికారి వ్యవహారాలు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పుకుంటున్నారు. కాగా శుక్రవారం రాత్రి జరిగిన ఘటనపై తహసీల్దారు కార్యాలయ సిబ్బంది రెవెన్యూ అసోసియేషన్ నేతలకు ఫిర్యాదు చేశారు. దీంతో అసోసియేషన్ నేతలు శనివారం సదరు అధికారి కార్యాలయానికి వెళ్లి ఆ అధికారితో చర్చించారు. కింది స్థాయి సిబ్బందితో అసభ్యకరంగా వ్యవహరించడం మూలంగా వారు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారి నుంచి ఏవైనా తప్పులు ఉంటే రాతపూర్వకంగానే ఇవ్వాలని సూచించారు. ఈ వ్యవహారం ఇప్పుడు అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఐటీడీఏ పీవోపై

సమగ్ర విచారణ జరిపించాలి

- యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

నెల్లూరు(హరనాథపురం), మార్చి 16 : జిల్లా కలెక్టర్‌కు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ మురళి పంపిన ఆదేశాల మేరకు నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఐటీడీఏ పీవోపై సమగ్ర విచారణ జరిపించాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 4న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి, కలెక్టర్‌కు పీవో అవినీతిపై పూర్తి ఆధారాలు సమర్పించి సమగ్ర విచారణ చేయించాలని కోరామన్నారు. యానాదుల సొమ్మును స్వాహా చేసిన పీవోకు యానాదులకు సబంధించి ఖర్చు చేసిన ప్రతిపైసా లెక్క చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, నగర అధ్యక్షురాలు కల్లూరు వరలక్ష్మి, మల్లిక, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వంటేరు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వంటేరు

కావలి, మార్చి16: టీడీపీతోనే రాజకీయ అరంగ్రేటం చేసిన కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి పదేళ్ల పాటు వైసీపీలో కొనసాగి, తిరిగి టీడీపీలో చేరారు. ఉండవల్లిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన శనివారం టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్ర మంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణం..కమనీయం



పెంచలకోనలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

రాపూరు (డక్కిలి), మార్చి 16: పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనసింహ స్వామి అమ్మవార్ల కల్యాణం శనివారం కన్నుల పండువగా సాగింది. ఉదయం 4 గంటలకు అభిషేకం, 10-30 గంటలకు స్వామివారి కల్యాణం జరిగింది. అనంతరం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నరసింహస్వామికి తిరుచ్చి పల్లకీసేవ జరగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ సాగర్‌బాబు పర్యవేక్షణలో మెరుగైన ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించండి

నెల్లూరు(జడ్పీ), మార్చి 16 : జిల్లాలో ఎండలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం భారీగా పెరు గుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యుత్ సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. ఆయన కార్యాలయం నుంచి శనివారం జిల్లా లోని అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో వినియోగం పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా ట్రాన్స్ ఫార్మర్లు, పరికరాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవా లన్నారు. సర్కిల్ పరిధిలో విద్యుత్ పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని, నెలఖరి లోపు వాటన్నింటిని మంజూరు చేయకపోతే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో జీఐఎస్ సర్వే పనులు ఇంకా పూర్తి కాలేదని, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ మురళి, ఈఈ శేషాద్రి బాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలీ దుర్మరణం

బిట్రగుంట, మార్చి 16: బోగోలు మండలం విశ్వనాథరావుపేట, తాళ్లూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలో జామాయిల్ చెట్లను కటింగ్ చేసే దినకూలీ రామిశెట్టి క్రిష్ణ (25) ప్రమాదవశాత్తు శనివారం మృతి చెందాడు. మేస్త్రీ సత్యనారాయణ కథనం మేరకు, తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం తాండ్రకోటకు చెందిన క్రిష్ణ కొన్నేళ్లుగా జామాయిల్ చెట్లను కటింగ్ చేసే కూలీగా పని చేస్తున్నాడు. బోగోలు మండల పరిధిలో అటవీ శాఖ పరిధిలో జామాయిల్ చెట్లను కటింగ్ చేసేందుకు 90 మంది కూలీలు వారం రోజులుగా పని చేస్తున్నారు. రోజులాగే శనివారం సాయంత్రం లారీలో జామాయిల్ కర్ర లోడింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో లారీ ముందుకు తీస్తుండగా దాని కింద పడుకుని ఉన్న క్రిష్ణకు చక్రాల బార్‌కుండ తగిలి గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని కాంట్రాక్టరుకు తెలిపామని మేస్త్రీ చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆయన తెలిపారు.

ఆరోగ్య పథకాలపై ప్రజలకు వివరించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), మార్చి 16 : ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా పథకాల అమలులో లక్ష్యాలను వంద శాతం పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఆరోగ్య సురక్ష-2ను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కింద గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కాన్, టీఫీ సౌకర్యం అందించాలన్నారు. అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ వ్యాక్సినేషన్ కార్యక్రమం పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సర్వేలో గుర్తించిన కుష్ఠు వ్యాధిగ్రస్తులకు వెంటనే వైద్య చికిత్స అందించాలని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రసవం జరిగిన అర్హులైన తల్లులను ఆరోగ్యశ్రీకి అనుసంధానం చెయ్యాలని తెలిపారు. నోడల్ అధికారి డాక్టర్ దయాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ బ్రిజిత, డాక్టర్ ప్రియంవద, డాక్టర్ రమేష్, డాక్టర్ సుధీర్‌కుమార్, డెమో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుల నిర్వహణపై మాక్ డ్రిల్!



మాక్ డ్రిల్ నిర్వహించిన నిపుణుల బృందం

ముత్తుకూరు, మార్చి 16: జాతీయ విపత్తుల నిర్వ హణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అదాని కృష్ణపట్నం పోర్టులో రసాయన, జీవ, రేడియోలాజికల్, న్యూక్లియర్ సంఘటనలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కోస్ట్ గార్డ్, పోలీసు, ఫైర్ సెక్యూరిటీ, కస్టమ్స్, పోర్టులోని సం బంధిత అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ మాక్ డ్రిల్ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్ బాబు పాల్గొని ప్రసంగించారు. మూడు రోజుల ప్రాథమిక శిక్షణ అనంతరం కెమికల్, బయోలాజికల్, రేడి యోలాజికల్, న్యూక్లియర్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్‌పై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వ ర్యంలో పోర్టులో ఇచ్చిన శిక్షణ కీలకమైందన్నారు. పోర్టు టెర్మినల్స్ లేదా బెర్తుల వద్ద ప్రమాదకర సంఘటన జరిగినప్పుడు త్వరితగతిన స్పం దించి విపత్తును ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ) ఏకే పీఎల్‌తో కలిసి ప్రాథ మిక శిక్షణను నిర్వహిస్తున్నట్లు తెలి పారు. శిక్షణలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సీనియర్ కన్సల్టెంట్, రజనీష్ పిప్లానీ బృందం, న్యూఢిల్లీ ఆల్ ఇండియా ఇన్‌స్టి ట్యూట్‌ద ఆఫ్ మెడి కల్ సైన్సెస్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, బెంగుళూరు లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు. జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీరశేఖర్, ఎకేపీఎల్ హెడ్ కార్పొరేట్ అఫైర్స్ కెఎం. రామ్, హెచ్.ఆర్ డీజీఎం శ్రీనివాసులు, సెక్యూ రిటీ సీనియర్ మేనేజర్ కుమార్, పోర్టు అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ జి.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

కావలి రూరల్, మార్చి16: పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ సంఘానికి చెందిన తన భర్త ఖాజావలి మద్యం మత్తులో తరచూ వేధిస్తున్నాడని ఆయన భార్య షకీల శనివారం రెండవపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు, బేల్దారి పనులు చేసే ఖాజావలికి అదే ప్రాంతానికి చెందిన షకీలతో సుమారు పదేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసై ఖాజావలి తనను వేధిస్తుంటే, ఆయన కుటుంబ సభ్యులు సహకరిస్తున్నట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాసంస్థ అకౌంటెంట్ అరెస్ట్

నెల్లూరు(క్రైం), మార్చి 16: నగరంలోని మాగుంట లేవుట్ ప్రాంతంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థలో అకౌంటెంట్‌గా నమ్మకంగా ఉంటూ వివిధ పద్దుల కింద రూ.లక్షలు కాజేసిన కేసులో దర్గామిట్ట పోలీసులు శనివారం ఆ అకౌంటెంట్‌ను అరెస్ట్ చేశారు. పోలీసుల సమా చారం మేరకు.. నగరంలోని ఇస్కాన్ సిటీకి చెందిన వినోద్ ఎంబీఏ పూర్తి చేసి మాగుంట లేవుట్‌లోని ఓ విద్యాసంస్థలో అకౌంటెంట్‌గా చేరారు. యాజమాన్యంతో ఎంతో నమ్మకంగా ఉంటూ వివిధ పద్దుల రూపంలో రూ.లక్షలు దోచేశాడు. మోసాన్ని గుర్తించిన యాజమాన్యం ఈ నెల 14వ తేదీన దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అసంపూర్తిగా జలజీవన్ మిషన్ పనులు

ఉదయగిరి రూరల్, మార్చి 16: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గండిపాళెం బీసీ కాలనీలో చేపట్టిన ఇంటింటికి కుళాయి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ సమస్యతో కాలనీ వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నినెలల క్రితం రూ.12లక్షలతో పనులు చేసేందుకు గుత్తేదారు అంగీకరించాడు. పాత పైపులను ధ్వంసం చేసి గుంతలు తీసి నూతన పైపు లైన్‌లు ఏర్పాటు చేశారే తప్ప మోటార్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. వేసవి కావడంతో తాగునీటి కోసం ఇతర కాలనీలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్ర ను వివరణ కోరగా సంబంధిత గుత్తేదారుడికి ఈ విషయాన్ని సూచించామని, సోమవారంలోపు పనులు పూర్తి చేసి కాలనీవాసుల తాగునీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.


తవ్వి వదిలేసిన పైపులైన్


అసంపూర్తిగా చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు

ఆక్రమణలో శ్మశాన వాటికలు

కావలిటౌన్, మార్చి16: పట్టణంలోని నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే శ్మశానవాటికల స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. శాంతినగర్‌లోని హిందూ శ్మశానవాటిక, క్రైస్తవ సమాధుల తోట, వైకుంఠపురంలోని హిందూ శ్మశాన స్థలాలు దాదాపు సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. అంతేకాక అక్కడ నిర్మాణాలు చేపట్టి, అద్దెలకు కూడా ఇస్తున్నారు. ముసునూరులోని ట్రంకురోడ్డు వద్ద రూ. కోట్లు విలువ చేసే ముస్లిం శ్మశానవాటిక ఆక్రమణకు గురికాగా, అందులో కొంతభాగాన్ని కాపాడుకుని ప్రహరీ నిర్మించుకున్నారు. కాగా ఆయా మతపెద్దలు ఆక్రమణల విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అధికారులు వాటిపై చర్యలు తీసుకోకపోగా, ఫిర్యాదులను అడ్డుపెట్టుకుని ఆక్రమార్కులవద్ద మామూళ్లు పుచ్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


శాంతినగర్‌లో ఆక్రమణకు గురైన హిందూ శ్మశానవాటిక

ప్రభుత్వ వైఫల్యాలే టీడీపీ గెలుపునకు నాంది

- రాష్ట్రంలో దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేద్దాం
- ఆత్మకూరులో టీడీపీ విజయం ఖాయం
- ఆనం రామనారాయణరెడ్డి


ఆత్మకూరులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మార్చి 16: ఆత్మకూరులో టీడీపీ పటిష్టంగా ఉంది. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితే విజయం ఖాయమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గ తెలుగు యువత, ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి చారిత్మాత్మక ఘట్టమన్నారు. ఈ కూటమి ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరుపేటలో జరగనున్న ప్రజాగళం మహాసభతో ఎన్నికల సమరానికి శ్రీకారం చుడతామని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమ పాలనను శాశ్వతంగా తుదిముట్టించడమే లక్ష్యంగా త్రిముఖ కూటమి వ్యూహాత్మకంగా ముందుకు కదులుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పదేళ్లుగా అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని, పూర్వవైభం రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రణాళిక మేర ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు బుల్లెట్ రమణ పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు : ఇంటూరి

కందుకూరు మార్చి 16 : ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. పట్టణంలోని పెద్ద బజారులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరావు, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కొత్త వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకటసుధాకర్, నల్లమల్లి వెంకటేశ్వర్లు, మునగా పిచ్చయ్య, ఇస్కాల మురళి తదితరులు పాల్గొన్నారు.


అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగేశ్వరావు

అమరజీవికి ఘనంగా నివాళి

కందుకూరు మండల ఆర్యవైశ్యసంఘం, వాసవీక్లబ్ లెజెండ్స్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని బండ్లమిట్ట సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో పట్టణంలోని జనార్ధనకాలనీ ప్రభుత్వ పాఠశాలకు వాటర్‌కూలర్ బహూకరించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందచేశారు. కార్యక్రమంలో పబ్బిశెట్టి శివ, మురారిశెట్టి శ్రీకాంత్, డాక్టరు తన్నీరు మల్లికార్జున, చీదెళ్ల వేణుగోపాలరావు, చక్కా కేశవ, కోట వెంకటనరసింహం, కనమర్లపూడి మురళి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులు

కావలి : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం ట్రంకు రోడ్డులోని ఆయన విగ్రహానికి పలు రాజకీయపార్టీలు, ఆర్యవైశ్య నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితోపాటు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, తిరువీధి ప్రసాద్, కటకం రాము, తటవర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జైభారత్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీనేతలు మాకినేని అరుణ, సిద్దూ, ఆర్యవైశ్య నేతలు పాదర్తి నాగరాజు, యేల్చూరు రవి, ప్రసాద్ ,రామకృష్ణ తదితరులు అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● బడుగుల అభ్యున్నతికి కృషి

కందుకూరు : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ కృషి చేస్తుందని ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు.పట్టణంలోని బృందావన కాలనీలో ఆయన శనివారం టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రతి కార్యకర్త టీడీపీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రమోద్, గేరా సురేష్, పాలేటి కోటేశ్వరావు, జంగాల రాఘవ, ఉండ్రాళ్ల సతీష్, జంగాల వెంకట్రావు, కసుకుర్తి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడి సేవలో నాగేశ్వరావు దంపతులు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని కందుకూరు టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన సతీమణి సౌజన్యతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు ఆయన వెంట టీడీపీ నాయకులు శివయ్య తదితరులు ఉన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మార్చి 16: డీసీపల్లి పొగాకు బోర్డులో శనివారం కేజీ కనిష్ట ధర రూ.227, గరిష్ట ధర రూ.230 పలికింది. రైతులు బోర్డుకు 380 బేళ్లను తీసుకొని రాగా.. 13కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 377బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 3 బేళ్ల తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

నేతలను కలిసిన వైసీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, మార్చి 16: నెల్లూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను శనివారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, నాయకులు ఇత్తడి రమణ, ఉప్పుటూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాలెంకు తరలిన టీడీపీ శ్రేణులు


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న బయ్యన్న, రియాజ్

ఉదయగిరి రూరల్, మార్చి 16: నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ శనివారం కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఉదయగిరి మండలం నుంచి టీడీపీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో ఇస్కపాలెంకు వెళ్లారు. వాహనాల ర్యాలీని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, మైనారిటీ నాయకులు షేక్ రియాజ్‌లు జెండా ఊపి ప్రారంభించారు.

సీతారామపురం: నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్ కొండాపురం మండలం సాయిపేట గ్రామ పంచాయతీలోని ఇస్కపాలెంకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. సీతారామపురం మండలంలోని తెలుగు తమ్ముళ్ల చింతల శ్రీను, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో శనివారం 60 కాన్వాయ్‌లతో వెళ్లారు.

చెత్త బుట్టల పంపిణీ


పంచాయతీ కార్యదర్శికి చెత్త బుట్టలు అందజేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

అనంతసాగరం, మార్చి 16: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ప్రభుత్వం సరఫరా చేసిన డస్ట్ బుట్టలను అందజేశారు. వాటిని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు అందించి స్వచ్ఛ సంకల్పం పై అవగాహన కల్పించాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

సీతారామపురం, మార్చి 16: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం అవుతున్నందున అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని శనివారం ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. పదో తరగతి పరీక్షల కేంద్రాలుగా వున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

ఉదయగిరి రూరల్: మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ గోపికృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టిశ్రీరాములని కొని యాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.కిషన్‌తేజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సంగంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ రవినాయక్

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సీఐ రవినాయక్, ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి, రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజా పాల్గొన్నారు.


ఉదయగిరిలో నివాళులర్పిస్తున్న గోపికృష్ణ, అధ్యాపకులు

వింజమూరు: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేష్‌బాబు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి రూరల్, మార్చి 16: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఎన్నికల సిబ్బందికి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్, వీడియో సర్వేకల్ బృందాలకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం నుంచి రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగించారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందువలన రాజకీయ పార్టీ నాయకులు హడావిడి చేయకుండా ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలన్నారు. ఆర్భాటాలకు బ్యానర్లకు కట్టేందుకు అనుమతి లేదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోక్‌అదాలత్‌లో 85 కేసుల పరిష్కారం

ఉదయగిరి రూరల్, మార్చి 16: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి జే.అంజయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 85కేసులను పరిష్కరించారు. అందులో క్రిమినల్ 78, సివిల్2, బ్యాంకు మేటర్‌కు సం బంధించిన కేసులు 5ఉన్నాయి. ఆయా కేసుల్లో జరిమానా కింద రూ.94,100, ఒప్పందం కింద రూ.27లక్షలు, బ్యాంకు మేటర్ కింద రూ.2.62 లక్షలు వసూలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు మురళి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి అంజయ్య

టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ

చేజర్ల, మార్చి 16: మాజీ మండలాధ్యక్షుడు, తూర్పుకంభంపాడు టీడీపీ నాయకులు అన్నలూరు శ్రీనివాసులునాయుడు శనివవారం మాజీ మంత్రి, ఆత్మకూరు తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బుల్లెట్ రమణ సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం పెరుమాళ్లపాడు సమీపంలోని ఆనం ఫాంహౌస్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అన్నలూరు శ్రీనివాసులునాయుడుతో పాటు 50కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నవకృష్ణ చౌదరి, నారాయణరెడ్డి కేశవచౌదరి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చర్యలు

ఉదయగిరి రూరల్, మార్చి 16: పట్టణంలోని సుద్దబావి వీధిలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువను శుభ్రం చేసి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. 'రహదారిపైనే మురుగు' అనే కథనం శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి కరీముల్లా పారిశుధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి రహదారిపై మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టారు.

సంగంలో పారామిలిటరీ దళాల కవాతు

సంగం, మార్చి 16: మండలకేంద్రంలో పారా మిలిటరీ దళాలు శనివారం కవాతు నిర్వహించారు. త్వరలో జరుగబోయే శాసనసభ, లోకసభ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించేందుకు వీలుగా ఓటర్లకు భరోసా కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పారా మిలిటరీ దళాలను పంపినట్లు సంగ సీఐ రవినాయిక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.

చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయను : కాకర్ల

కొండాపురం, మార్చి16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం నుంచి శనివారం ఆయన ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్కపాలెంలో డ్రైనేజీ వ్యవస్థతోపాటు రోడ్లు సరిగాలేవని, అలాగే మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు విషయమై ప్రజలు తనదృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. తాను గెలిచాక సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అంతకుముందు సాయిపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా ఇస్కపాలెం చేరుకున్నారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా కాకర్లను ఇస్కపాలెం ప్రజలు గుర్రంపై ఊరేగించారు.మక్కెనవారిపాళెంలో మాజీ జడ్పీటీసీ దామ మహేశ్వరరావు కాకర్లను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎమ్.ఓంకారం, గంటా లక్ష్మీనరసంహులు, కుంకు మోహనరావు, దామా మహేశ్వరరావు, దామా శివబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాకర్లకు ఘనస్వాగతం

కలిగిరి : కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిగిరి నుంచి కొండాపురం వెళ్లే మార్గంలో కలిగిరమ్మ గుడి సర్కిల్ వద్ద అతనితోపాటు మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయగిరి మార్కెటింగ్ మాజీ ఛైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిలకు మండలవాసులు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, జనసేన నాయకులు బండారు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు నేతలు కార్లలో కొండాపురం మండలానికి బయలుదేరి వెళ్లారు.

అల్లూరులో బైక్ ర్యాలీ

అల్లూరు : టీడీపీ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా అల్లూరులోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో అల్లూరు కోనేరు సెంటరు నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ర్యాలీ కొండబిట్రగుంట బిలకూట క్షేత్రానికి చేరుకొని ప్రసన్న వేంకటేశ్వరుడి పూజలు నిర్వహించారు. అంతకుముందు పోలేరమ్మ చెట్టు, అంజనేయస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, సామంతుల కిరణ్‌రెడ్డి, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పొడమేకల మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొండాపురం : కాకర్లను గుర్రంపై ఊరేగిస్తున్న ఇస్కపాలెం గ్రామస్థులు

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీలో పలు కుటుంబాల వారు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కరేడు ఎస్సీ కాలనీ, చైతన్యనగర్, చిన్న పల్లెపాలెం, అలగాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రాచగల్ల సుబ్బారావు, కన్నా ప్రసాదు, పాలుబోయిన శ్రీనివాసులు, చిట్టా బంగారురెడ్డి, మెట్ట శ్రీనివాసులురెడ్డి, వాయిల శ్రీను, వల్లభుని రమణయ్యనాయుడు కోటయ్య, యరమల వాసు, నాయుడు సుధ, మద్దెల శ్రీధర్, కొల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 7,69,275

వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 7,69,275 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు... అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,150, కుంకుమార్చన ద్వారా రూ. 28,480, వివాహాల ద్వారా రూ. 12 వేలు, తలనీలాల ద్వారా రూ. 29,025, వాహనపూజల ద్వారా రూ. 2,920, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,30,900, స్థల పురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 8,80, రూములఅద్దెల ద్వారా రూ. 2,13,230, అన్నదానం ద్వారా రూ. 1,89,100, విరాళాల ద్వారా రూ. 23,050 ఆదాయం లభించిందన్నారు.

ట్రాక్టరు ఢీకొని యువకుడి మృతి

కందుకూరు : మట్టి ట్రాక్టరు ఢీకొని యువకుడు మృతి చెందాడు.ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో పొన్నలూరు మండలం విప్పగుంటకి చెందిన కొంకా మురళి(49) అక్కడికక్కడే మృతిచెందాడు. మురళి ఫిజియోథెరపి కోసం కందుకూరు వచ్చి మోటారుసైకిల్‌పై తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

వాలీబాల్ కోర్టుల ప్రారంభం

ఉలవపాడు : మండలంలోని కరేడు చిన్నపల్లెపాలెం, పెద్దపట్టపుపాలెం గ్రామాల్లో యువత కోరిక మేరకు కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు స్వంత నిధులతో నిర్మించిన వాలీబాల్ కోర్టులను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాచగల్ల సుబ్బారావు, కన్నా ప్రసాదు పాల్గొన్నారు.

వాసుబాబుకు అభినందనలు

వలేటివారిపాలెం : టుబాకో బోర్డు వైస్ ఛైర్మన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన వలేటివారిపాలెం నివాసి గుత్తా వాసుబాబుకు గ్రామస్థులతోపాటు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వలేటి మాల్యాద్రి, వలేటి నరసింహం శాలువా, పుష్పగుచ్ఛం అందజేశారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని వారు ఆయన్ను కోరారు.

కేంద్ర బలగాల కవాతు

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. కావలి రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో కొండబిట్రగుంట, పాతబిట్రగుంట, ముంగమూరు, కడనూతల గ్రామాల్లో వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్సై సుధాకర్‌రెడ్డి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అల్లూరు : స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలిలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించా రు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సిద్దా ప్రసాద్, డీ బ్రహ్మానందరావు, ఎం సురేష్, వై సురేంద్ర పాల్గొన్నారు.

ఆదరించండి... అభివృద్ధి చేసి చూపిస్తా : కావ్య

కావలి రూరల్, మార్చి16: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తాళ్లపాలెం, అన్నగారిపాలెం పంచాయతీల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామ నాయకులతో సమావేశమై ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధి విధానాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు.


టీడీపీలో చేరిన వారితో కావ్య క్రిష్ణారెడ్డి

● వైసీపీ నుంచి వలసలు

కాగా తాళ్లపాలెం, అన్నగారిపాలెం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తాళ్లపాలెంకి చెందిన వీరయ్య, మదన్‌గోపాల్‌రెడ్డి, పాలామల్లికార్జున్, శ్రీనివాసులు, లక్ష్మీపురానికి చెందిన మామిడి వెంకటరమణయ్య, చెంచంగారి పోతురాజు, మరో 12 మంది టీడీపీలో చేరారు. అలాగే వెంకటేశ్వరపురం నుంచి టీడీపీ లో చేరిన వారికి క్రిష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల రామక్రిష్ణ ఉప్పాల వెంకట్రావు, కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● రాక్షసపాలనకు విముక్తి

కావలి : ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో ఎట్టకేలకు రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌తో రాష్ట్రంలో ప్రశాంతత వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, ఆవుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు : ఆర్‌జేడీ

కావలిటౌన్, మార్చి16: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీ మువ్వా రామలింగం తెలిపారు. శనివారం స్థానిక శాంతినగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల సమావేశ మందిరంలో పది పరీక్షల డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో పీవీజే రామారావుతో కలిసి మువ్వా మాట్లాడుతూ సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షలకు అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడా అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించామని, అక్కడి వసతులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కావలి పట్టణంలో బైక్ ర్యాలీ

కావలిటౌన్ : కావలి నియోజకవర్గాన్ని రూ.కోట్ల సొంతనిధులతో అభివృద్ధి చేశారని, తనను ఆదరించాలని పీఎస్సార్ ట్రస్ట్ అధినేత, స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ కోరారు. శనివారం పట్టణంలో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ముసునూరు శివారు వద్ద నుంచి ర్యాలీ పీఎస్సార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం పీఎస్సార్ మాట్లాడుతూ ఎన్ని అవినీతి, అక్రమాలు చేసినా పోటీ చేసేది రెడ్లే కాబట్టి, గెలిచేది వారేనని అన్నారు. బీసీలను వృద్ధిలోకి ఆశయంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, పెనుగొండయ్య గౌడ్, దావులూరి శ్యాంసన్, శ్రీనివాసులు గౌడ్, మైనంపాటి జగదీష్, పలువురు పసుపులేటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల ప్రచారం

బిట్రగుంట, మార్చి 16: బోగోలు మండలంలో శనివారం తెలుగు తమ్ముళ్లు ఎన్నికల ప్రచారం చేశారు. ఇబ్రహీంపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కావలి నుంచి కావ్య క్రిష్ణారెడ్డిని, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో సుధీర్‌బాబు, మాధవరావు, అహ్మద్, ఖలీల్, మల్లిక, హరిబాబు, నరసింహరావు పాల్గొన్నారు. బోగోలు మార్కెట్ వీధిలో మాజీ ఎంపీటీసీ ముంతాల వెంకయ్య ఆధ్వర్యంలో గౌస్‌భాషా, వెంకటేశ్వర్లు, అరుణమ్మ, రమేష్ ప్రచారం చేశారు. అల్లూరు నుంచి కొండబిట్రగుంట వరకు బైక్ ర్యాలీగా వచ్చిన వారికి విజయ్‌కుమార్ యాదవ్ స్వాగతం పలికారు.

19న విద్యుత్ లోక్‌అదాలత్

లింగసముద్రం, మార్చి 16: ఈ నెల 19న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్థానిక వేముల అంజయ్య కళ్యాణ మండపంలో విద్యుత్ లోక్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కందుకూరు ఈఈ ఏ వీరయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి ఎన్ విక్టర్ ఇమ్మాను యేలు, ఫోరం సభ్యులు ఒంగోలు విద్యుత్ ఎస్ఈ సత్యనారాయణ పాల్గొంటారని ఆయన తెలిపారు. లింగసముద్రం మండల విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను పరిష్క రించుకోవాలన్నారు.

సోమశిలలో 12.479 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 16: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి జలాశయంలో 12.479 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 370 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



పొదలకూరు: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇందుకూరుపేట: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాంధీ ఆశ్రమ నిర్వాహకులు



సైదాపురం: నివాళులర్పిస్తున్న అధికారులు

చిరస్మరణీయుడు పొట్టిశ్రీరాములు

పొదలకూరు, మార్చి 16: స్థానిక బస్టాండు ఆవరణంలో రూరల్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరి చెంచయ్య, పొట్టి సుధాకర్, మీరా మధు, తన్నీరు సురేష్, రాచపూటి ధనుంజయ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన మహనీయుడని ఆయన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. భాషా ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పడడానికి ఆద్యుడు అమరజీవి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం మండల, పట్టణ, యువజన ఆర్యవైశ్య సంఘం నాయకులు రాజాసురేంద్ర, డాక్టర్ జొన్నలగడ్డ బ్రహ్మయ్య, ఆకులూరు విజయ, పైడా కామేశ్వరరావు, పిన్నెల ప్రభాకర్, చిట్లూరు సుబ్రహ్మణ్యం, సురేష్, చిన్నయ్య పాల్గొన్నారు.



వెంకటాచలం: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వీఎస్‌యూలో...

వెంకటాచలం: కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ అనుచరుడిగా పొట్టి శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం లాంటి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. విద్యార్థులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అందే ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆలం ఉదయ్ శంకర్, డాక్టర్ హనేసయ్య, డాక్టర్ వెంకట్రాయులు, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, సుజా ఎస్‌నాయర్, సీహెచ్ విజయ, డాక్టర్ కే సునీత, డాక్టర్ సుజాత, డాక్టర్ త్రివేణి ఉన్నారు.

గాంధీ ఆశ్రమంలో..

ఇందుకూరుపేట: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో శనివారం కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కమిటీ సభ్యురాలు గంపల మంజుల పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రరెడ్డి మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలకు పొట్టిశ్రీరాములు ఆకర్షితులై సబర్మతి ఆశ్రమంలో చేరి ఆయన అనుచరులుగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, ఏవో పురుషోత్తం శివ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● స్టోన్‌హౌస్‌పేటను పొట్టిశ్రీరాములు నగర్‌గా మార్చాలి

నగరంలోని స్టోన్‌హౌస్‌పేటను పొట్టిశ్రీరాములునగర్‌గా మార్చాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ, మెంటా వీరబ్రహ్మం గుప్తా, ప్రవీణ్‌శంకర్, పేగు షణ్ముఖం పాల్గొన్నారు.







పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆనం అరుణమ్మ, ఎన్ఎంసీ కమిషనర్ వికాస్, విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు(జడ్పీ) : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం, పోరాటం ఆదర్శనీయమని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన చిత్రపటానికి డిప్యూటీ సీఈవో చిరంజీవి, అధికారులతో కలసి ఆమె నివాళులర్పించారు.

నెల్లూరు(సిటీ) : కార్పొరేషన్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు సిటీ నియోజక వర్గంలో ఏర్పాట్లుపై సమీక్షించారు. మసీదుల వద్ద పారిశుధ్య ఏర్పాట్లును ఎంహెచ్‌వో వెంకటరమణయ్య పరిశీలించారు.

● భారతరత్న ఇవ్వాలి...

నెల్లూరు (సాంస్కృతికం) : అమరజీవి పొట్టిశ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పేగు.షణ్ముఖరావు డిమాండ్ చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ర్యాలీగా తరలివచ్చి ఆత్మకూరు బస్టాండు వద్ద అమరజీవి విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర అసెంబ్లీలో పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండా ప్రవీణ్‌శంకర్, భవనాశి సురేష్, పీవీ.శేషారావు, జొన్నలగడ్డ మోహన్‌రావు, మెంటా గురుబ్రహ్మం, దర్శి హరిబాబు పాల్గొన్నారు.

● బాలభవన్ ఆధ్వర్యంలో కొండాయపాలెం మెయిన్ ఎంపీపీ స్కూల్‌లో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు పొట్టిశ్రీరాములుకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● ది అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, నుడా చైర్మన్ ద్వారకానాథ్, నగర డిప్యూటీ మేయర్ ఖలీల్ పాల్గొని పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ది అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భైసాని జ్యోతిప్రసాద్, రేపాల శ్రీనివాసరావు, శ్రీరామ్ సురేష్, కామేశ్వరరావు, పెంచలకుమార్ పాల్గొన్నారు.

నెల్లూరు(క్రైం) : జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలియా, అజయ్‌బాబు, కాంతర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జనసేన నేతలు

● ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి బీజేపీ నాయకుడు మిడతల రమేష్, తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పైడిమాని ఆదినారాయణ, పొట్టి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతల నివాళి

జొన్నవాడలో పోషణ్ పక్వాడా

బుచ్చిరెడ్డిపాలెం,మార్చి16: మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే ఉమ, పెనుబల్లి, జొన్నవాడ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది సరస్వతి, ఏఎన్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

పుంజులూరుపాడులో ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం, మార్చి 16: పుంజులూరుపాడులో స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారి శ్రీనివాసులునాయుడు పాల్గొని ఎదకురాని 8గేదేలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే 15 గేదేలకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 22 గేదేలకు సాధారణ చికిత్స, 44 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. అనంతరం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

పది పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడిపోగు కిరణ్‌కిషోర్

వెంకటాచలం, మార్చి 16: పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడిపోగు కిరణ్ కిషోర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసతులు, తాగునీరు కల్పించాలని, మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ వంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రవీంద్రభారతీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో గతంలో విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారని, విద్యార్థులను ఎండలోనే నిలబెట్టారని, ఇలాంటివి జరగకుండా ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో చోరీల నివారణ : సీఐ

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి16: పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో ఇటీవల చోరీలు జరుగుతున్నాయని, ప్రజలు పోలీసులకు సహకరించి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)ను ఏర్పాటు చేసుకుంటే చోరీలను నివారించవచ్చని సీఐ హైమారావు తెలిపారు. శనివారం ఆయన బుచ్చి పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారమిస్తే, ఎలాంటి ఖర్చు లేకుండా ఓ కెమెరాను ఆ ఇంట్లో ఏర్పాటు చేస్తామన్నారు. దొంగలు ఆ ఇంటికి వచ్చిన వెంటనే ఆ ఇంటి నుంచి స్టేషన్‌కు ఫోన్‌కాల్ వస్తుందన్నారు. దీంతో పోలీసులు వెళ్లి దొంగలను పట్టుకునే అవకాశం ఉందని తెలిపారు. బైక్‌లకు సైలెన్సర్లు తీసేసి ర్యాష్ డ్రైవింగ్‌తో పెద్ద శబ్దాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైసీపీ నేతల సంబరాలు

రాపూరు(డక్కిలి): వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ టికెట్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి పేరును ఖరారు చేయడంతో సీనియర్ వైసీపీ నాయకులు పాపకన్ను మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శేణులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాపకన్ను దయాకరరెడ్డి, నారాయణరెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి, పట్టాబిరామిరెడ్డి, నారసింహారెడ్డి ఉన్నారు.

రాపూరు- చెన్నై బస్సు సర్వీసును పునరుద్ధరించండి

రాపూరు(డక్కిలి): రాపూరు ఆర్టీసీ డిపో నుంచి రాపూరు-చెన్నై బస్సు సర్వీసును పునరుద్ధరించాలని శనివారం జరిగిన డయిల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు కోరినట్లు డిపో మేనేజర్ అనిల్ కుమార్ తెలిపారు. రాపూరు-ఏఎస్‌పేట, నెల్లూరు నుంచి రాత్రి సర్వీసును 10-15 గంటలకు నడిపేలా చూడాలని తెలిపారు. వీటని పరిశీలించి చర్యలు తీసుకొంటామన్నారు.

మే 13న సర్వేపల్లికి పట్టిన గ్రహణం తొలగిపోతుంది

● దేశంలోనే కిరాతకమైన, అరాచక పాలన మంత్రి కాకాణిది !



బాబు షూరిటీ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి

పొదలకూరు, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజైన మే 13న సర్వేపల్లికి పట్టిన మంత్రి కాకాణి అనే గ్రహణం తొలగిపోతుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి పట్టణంలోని రమణారెడ్డి కాలనీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని బాబు సూపర్-6 కరపత్రాలను ఇంటింటికి పంచి ప్రచారం నిర్వహించారు. సోమిరెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణి దేశంలోనే కిరాతకమైన, అరాచక పాలనను కొనసాగించారన్నారు. ఎన్నికల కోడ్‌తో కాకాణి అహంకారానికి, దుర్మార్గాలకు ఫుల్‌స్టాప్ పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, మండల నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, రామకృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, రాపూరు బాబు, ఆదాల సుగుణమ్మ, బక్కయ్యనాయుడు, పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, గాలి శ్రీనివాసులు, రోహిత్, వంశీ, పచ్చిపాల భాస్కర్, చత్రపతి మస్తాన్, పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి గెలుపునకు కృషి



మహిళలకు అభివాదం చేస్తున్న ప్రశాంతిరెడ్డి

విడవలూరు, మార్చి 16: కోవూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు పాటుపడతామని చౌకిచర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, వైసీపీ నాయకులు ఓగు నాగేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన సుమారు 400మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రశాంతిరెడ్డిని ఆమె నివాసంలో కలసి మద్దతు తెలిపారు. అనంతరం ప్రశాంతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పలువురు వైసీపీ నాయకులు టీడీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. త్వరలో గ్రామంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి వైసీపీ కార్యకర్తలను టీడీపీలో చేర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొల్లు చిన్నవెంకయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ నేతల సన్మానం

అలగే మండల పరిధిలోని అలగానిపాడు, దంపూరు, రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు చింతగింజల కృష్ణ, వంగర వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సాయిభార్గవ, మల్లికార్జున. చేవూరు రాంప్రసాద్, కొమ్మి శ్రీధర్‌నాయుడు, రాజకుమారి, ప్రభాకర్ తదితరులు ప్రశాంత్‌రెడ్డిని కలసి సన్మానించారు.

● వేణుగోపాలుడి సేవలో ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : పంచేడు గ్రామంలోని వేణుగోపాలస్వామిని శనివారం కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేకం సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప, సూరా శ్రీనివాసులురెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు ఆమె హోమ పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ పండితులు, గ్రామ సర్పంచు సూరా విజయమ్మ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట కౌన్సిలర్ ప్రత్యూష, టీడీపీ నాయకులు ఉన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

మనుబోలు : శ్రీసేవా నాదం ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మనుబోలులో శనివారం సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. మొదటి, రెండు విడతలలో ప్రధాన కూడలిలలో చెట్ల కింద, దేవాలయాల ఆవరణం, పాఠశాల ఆవరణంలోనూ వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డిని గ్రామస్థులు అభినందించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు

వెంకటాచలం, మార్చి 16: ఎన్నికల్లో అందరూ ఖచ్చితంగా ఎన్నికల నియమావళిని పాటించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు ఆదేశించారు. వెంకటాచలం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం నుంచి జూన్ 6వ తేది వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. సాయంత్రం వెంకటాచలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గోడలకు అతికించిన పోస్టర్లను సిబ్బందితో తొలగించారు. ఐదు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

● **మనుబోలు :** ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తామని ఎంపీడీవో జీవీఎస్‌వి ప్రసాద్ తెలిపారు. శనివారం మనుబోలు సచివాలయం -2లో ఉన్న ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించారు. ఆయన వెంట వీఆర్‌వో నాగార్జున్‌రెడ్డి ఉన్నారు.

కామాక్షితాయి సేవలో కేంద్ర విజిలెన్స్ డీఐజీ



కామాక్షితాయిని దర్శించుకుంటున్న కేంద్ర విజిలెన్స్ డీఐజీ రాజేంద్రనాథ్ సింగ్ దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి16: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శనివారం కామాక్షితాయిని కేంద్ర విజిలెన్స్ డీఐజీ రాజేంద్ర నాథ్‌సింగ్ దంపతులు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈవో వీ గిరికృష్ణ, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గోత్ర నామాలతో ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రసాదాలు అందచేసి, ఘనంగా శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పలువురు విజిలెన్స్ అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ) : నగరంలోని ఏకే నగర్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్లు మరమ్మతులు చేస్తునందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహపురి కాలనీ, న్యూ మిలటరీ కాలనీ, చైతన్యపురి కాలనీ, పోస్టల్ కాలనీ, వేదాయపాళెం సెంటర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

సంక్షేమం తొలగింపునకే కరెంట్ బిల్లు పెంపు

● జగన్ సర్కారుపై ధ్వజమెత్తిన కోటంరెడ్డి



కోటంరెడ్డి సోదరులను సత్కరిస్తున్న కార్యకర్తలు

నెల్లూరురూరల్, మార్చి 16 : పేదలకు ప్రజా సంక్షేమాన్ని దూరం చేసేందుకే జగన్ కరెంట్ బిల్లులను పెంచుకుంటుపోయారని టీడీపీ నెల్లూరురూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని కాకుపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో స్థానిక సర్పంచు కోసూరు సుభాషిణి, కేశవుల దంపతులతో పాటు, వార్డు మెంబర్లు, మాదరాజుగూడూరు సర్పంచు వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు, వారి అనుచరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార పార్టీకి ఎవరు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ముందుగా కార్యకర్తల ర్యాలీ ఆకట్టుకోగా, గజమాలతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కుడుముల నాగేశ్వరరావు, ఉప్పల ఈశ్వరయ్య, శివ, సారంగం గున్నయ్య, ఆల్తూరి మస్తానయ్య, కుంచాల విజయభాస్కర్, వేణు(బాబీ) పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

నెల్లూరు(వ్యవసాయం) : వైసీపీని ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని 28వ డివిజన్‌కు చెందిన రాజరాజేశ్వరి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ ధర్మకర్తలు గూడంశెట్టి దొరబాబు, బొట్టు బాబు వైసీపీకి రాజీనామా చేసి శనివారం ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే 23వ డివిజన్ చలపతినగర్, సుందరయ్యకాలనీ, ఆటోనగర్‌కు చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, చెక్క సాయిసునీల్, మేకల మధు, నెలపూడి సుధాకర్, నన్నం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా క్లిష్టమైన ఈఎన్‌టీ శస్త్రచికిత్స



చిన్నారితో కలసి మాట్లాడుతున్న వైద్యబృందం

నెల్లూరు(వైద్యం), మార్చి 16 : నారాయణ ఆసుపత్రిలో అరుదైన, క్లిష్టమైన ఈఎన్‌టీ శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు ఈఎన్‌టీ డాక్టర్ హిమజ తెలిపారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పొదలకూరుకు చెందిన అభినందన(12) ఆరు నెలలుగా ముక్కు ద్వారా ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడేవాడన్నారు. దీనివల్ల విపరీతమైన తలనొప్పితో నారాయణ ఆసుపత్రికి రావడంతో పూర్తిస్థాయిలో అధునాతన పరీక్షలు నిర్వహించగా చిన్నపిల్లల్లో వచ్చే అరుదైన వ్యాధిగా గుర్తించామన్నారు. దీంతో బాలుడి కంటిచూపు, మెదడుకు ఎటువంటి నష్టం జరగకుండా శస్త్రచికిత్స చేశామని తెలిపారు. మరో వైద్యులు డాక్టర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ సాధారణంగా ఇలాంటి వ్యాధులు పెద్దవారిలో మాత్రమే వస్తుంటాయన్నారు. నారాయణ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్లిష్టమైన, ఖరీదైన శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ ఇంద్రనీల్, మత్తు వైద్యుడు డాక్టర్ షైనీ, ఏజీఎం శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి16: రామకృష్ణానగర్‌లో నడిచి వెళుతున్న కొండమ్మ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుని వెళ్లాడు. గొలుసు 3 సవర్లకుపైగా ఉంటుందని బాధితురాలు తెలిపింది. కొండమ్మ ఫిర్యాదు ఆధారంగా సీసీ ఫుటేజీని పరిశీలించి దొంగను గుర్తించినట్లు సీఐ హైమారావు తెలిపారు.

క్రికెట్‌తో యువతకు ఉజ్వల భవిత

నెల్లూరు(విద్య), మార్చి 16 : జిల్లాలో క్రికెట్‌కు విశేష ఆదరణ లభిస్తుండడంతో క్రికెట్ క్రీడాభివృద్ధి చెందుతుందని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పి.రూపకుమార్ యాదవ్ తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కొండాయపాళెంలో ఏర్పాటు చేసిన యునైటెడ్ క్రికెట్ అకాడమీ నెట్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీఏ అడ్వైజర్ డి.శ్రీనివాసరెడ్డి, అకాడమీ నిర్వాహకులు పి.మోహన్‌కృష్ణ, సీనియర్ క్రీడాకారులు భాను ప్రకాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌డీసీఏ కోచ్‌లు జులకర్, రాజశేఖర్, మాధురి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

షట్టర్ గేట్లు కుంభకోణంపై విచారణ జరపాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 16: కనుపూరు కాలువ నుంచి పంట పొలాలకు నీరు అందించే తూముల షట్టర్ గేట్లు కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ నమామీగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు శనివారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో లవన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, నారాయణరావు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ అజీజ్‌తో శాంతకుమారి భేటీ



అజీజ్‌ను సన్మానిస్తున్న శాంతకుమారి

నెల్లూరు(వైద్యం), మార్చి 16 : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శాంతకుమారి శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నగరంలోని హరనాథపురంలోని అజీజ్ నివాసానికి వచ్చిన మె అజీజ్, అయన సతీమణి షర్మిలకు శాలువా కప్పి, పుష్పగుచ్చంతో సత్కరించారు. పలు అంశాలపై చర్చించారు.

చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో కవాతు

నెల్లూరు(క్రైం), మార్చి 16: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ నేతృత్వంలో స్టేషన్ పరిధిలోని డైకాస్‌రోడ్డు, కోటమిట్ట, జెండావీధి, ఖుద్దూస్ నగర్, మెక్లన్‌రోడ్డు ప్రాంతాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలందరూ ప్రశాంతంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

జగన్‌కి కళ్లు నెత్తికెక్కాయి

● పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), మార్చి 16: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయని మాజీమంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ విమర్శించారు. శనివారం నగరంలోని వీఎస్ఆర్ కళ్యాణ మండపంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎక్కడా లేని అరాచక పాలన ఆంధ్రలోనే ఉందని ఆరోపించారు. వైసీపీని దించే సమయం ఆసన్నమయిందన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నేత అజయ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, జనసేన నేత గునుకుల కిశోర్, టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన అభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 16 : నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యానమందిరంలో శనివారం శ్రీలక్ష్మీ నరసింహనాథ, నాగేంద్ర సరస్వతీ స్వామి వర్ధోత్సవ ఆరాధన సందర్భంగా తలుపూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సహస్ర లింగార్చన అభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. లక్ష్మీకామేశ్వరి భక్త బృందం శివానంద లహరి, భక్తిగానాలు అలరించాయి. కర్పూర హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాలతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమాలను ధ్యాన మందిరం మేనేజరు చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, తదితరులు పర్యవేక్షించారు.

రత్నంలో వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు(విద్య), మార్చి 16 : నగరంలోని సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం హైస్కూల్‌లో శనివారం సైన్స్ చిల్డ్రన్స్ కాన్ఫరెన్స్ పేరుతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్, నగర ఎంఈవోలు భిక్షాలు, తిరుపాల్ పాల్గొని వివిధ ప్రాజెక్టులను సందర్శించి విద్యార్థులను అభినందించారు. చంద్రయాన్, హైడ్రాలిక్ బ్రిక్స్, మిలటరీ రోవర్, కార్డియాక్ సైకిల్, పిండదశలు, రాకెట్, రూథర్‌ఫర్డ్ మోడల్ వాటర్, సైకిల్ రోబోట్ తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ఏవో సునీల్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రహర్ష, తదితరులు పాల్గొన్నారు.



● రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్ నెక్స్ట్ ఒలంపియాడ్ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన 600కు పైగా నమూనాలు ఆకట్టుకున్నాయి. అతిథులు, తల్లిదండ్రులు ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి, రోషిణి, ప్రిన్సిపాల్ కళ్యాణి, మేనేజర్ రాజేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 17 మార్చి 2024



సమన్వయకర్తలే వైసీపీ అభ్యర్థులు!

ముగ్గురు వారసులు... నలుగురికి మళ్లీ ఛాన్సు

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం అభ్యర్థులను శనివారం ప్రకటించింది.ఇదివరకే ప్రకటించిన నియోజకవర్గాల సమన్వయకర్తలే రానున్న ఎన్నికల బరిలో అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.వీరిలో ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు, ఒక సిట్టింగ్ ఎంపీకి మళ్లీ పోటీ చేసే ఛాన్సు లభించింది. మంత్రి రోజా వైసీపీ తరపున నగరి నుంచీ వరుసగా మూడోసారి, మొత్తంగా అయితే ఐదవసారి పోటీ చేయనున్నారు.కిలివేటి సంజీవయ్య సూళ్ళూరుపేట నుంచీ మూడవసారి పోటీ చేస్తున్నారు.బియ్యపు మధుసూదన రెడ్డి శ్రీకాళహస్తి నుంచీ వరుసగా మూడవసారి వైసీపీ తరపున పోటీ చేస్తున్నారు.తిరుపతి లోక్‌సభకు 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచిన సిట్టింగ్ ఎంపీ గురుమూర్తికి ప్రస్తుత ఎన్నికల్లో పార్టీ మళ్లీ అవకాశం కల్పించింది.

వెంకటగిరి



పేరు: నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి
పుట్టిన తేదీ: 8.1.1965
విద్యార్హత: బీటెక్
తల్లిదండ్రులు: నేదురుమల్లి జనార్దనరెడ్డి , రాజ్యలక్ష్మి
భార్య స్వప్న, పిల్లలు: అలేఖ్య రెడ్డి, విక్రమ్ రెడ్డి
స్వగ్రామం: విద్యానగర్,వాకాడు మండలం
గతంలో పదవులు: కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్(ఎడ్యుకేషనల్), తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు.

నగరి



పూర్తి పేరు: ఆర్కే రోజా
పుట్టిన తేదీ: 11.07.1972
భర్త: సెల్వమణి
కుమారుడు: కృష్ణ కౌశిక్,
కుమార్తె: హన్షుమాలిక
విద్యార్హత: బీఎస్సీ
సొంతూరు: మూగలమర్రి, వాల్మీకిపురం మండలం
రాజకీయ నేపథ్యం: 1999లో టీడీపీ తరపున ప్రచారం చేశారు. 2004 ఎన్నికల్లో నగరి టీడీపీ నుంచి ఓటమి. 2009 ఎన్నికల్లో చంద్రగిరి టీడీపీ నుంచి ఓటమి. 2014, 2019 ఎన్నికల్లో నగరిలో వైసీపీ నుంచి గెలుపు. పర్యాటకశాఖ మంత్రిగా పనిచేశారు.

గూడూరు



పేరు: మేరిగ మురళీధర్
పుట్టిన తేది : 5-1-1969
విద్యార్హత: ఎంఏ
తల్లిదండ్రులు: మేరిగ ఆనందరావు, సుందరమ్మ
భార్య: జ్యోతి
పిల్లలు: రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్
స్వగ్రామం: రాపూరు
గతంలో పదవులు: జడ్పీటీసీ సభ్యుడిగా, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా, వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా, శాసనమండలి విప్‌గా వ్యవహరిస్తున్నారు.

సూళ్లూరు పేట



పేరు: కిలివేటి సంజీవయ్య
పుట్టిన తేది: 2 ఆగస్టు 1965
విద్యార్హత: బీటెక్
తల్లిదండ్రులు: కిలివేటి రాజయ్య, మస్తానమ్మ
భార్య: పసల సుభాషిణి
పిల్లలు: ఇద్దరు ఆడపిల్లలు
స్వగ్రామం: కాదలూరు, తడ మండలం
గతంలో పదవులు: 2014, 2019లో సూళ్లూరుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చంద్రగిరి



పేరు: చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
పుట్టిన తేది: 29-6-1998
విద్యార్హత: ఎంఎస్
స్వస్థలం: తుమ్మలగుంట, తిరుపతి రూరల్ మండలం
తల్లిదండ్రులు: చెవిరెడ్డి భాస్కరరెడ్డి,లక్ష్మి - గతంలో పదవులు : తిరుపతి రూరల్ ఎంపీపీ, తుడా చైర్మన్

ఐదుగురికి తొలి అవకాశం

వెంకటగిరి నుంచీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అయితే ఉపసంహరణ గడువు ముగిశాక పోటీ నుంచీ తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఆయన బరి నుంచీ తప్పుకున్నా సాంకేతికంగా మాత్రం ఆ ఎన్నికల్లో అభ్యర్థిగానే వున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ తరపున వెంకటగిరి నుంచీ పోటీ చేస్తున్నారు. గూడూరు అభ్యర్థి మేరిగ మురళీధర్ గతేడాదిలో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకుమునుపు రాపూరు జడ్పీటీసీగా గెలిచారు. అసెంబ్లీ బరిలో తొలిసారిగా ఇపుడు పోటీ చేస్తున్నారు. తిరుపతి నుంచి భూమన అభినయరెడ్డి ,చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సత్యవేడు నుంచీ నూకతోటి రాజేష్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ పడుతున్నారు.

తిరుపతి



పేరు : భూమన అభినయరెడ్డి
పుట్టిన తేది : 30-7-1987
విద్యార్హత : ఎంఎస్
తల్లిదండ్రులు: భూమన కరుణాకర రెడ్డి, రేవతి
భార్య : మోనీషారెడ్డి
పిల్లలు: కుమారుడు వీర్ అద్యాంత్, కుమార్తె అర్యాహి
స్వస్థలం : తిరుపతి గతంలో పదవులు : తిరుపతి డిప్యూటీ మేయర్

శ్రీకాళహస్తి



పేరు: బియ్యపు మధుసూదన రెడ్డి
పుట్టిన తేది: 15-5-1971
విద్యార్హత: బీఏ
తల్లిదండ్రులు: సుశీలమ్మ, గోవిందరెడ్డి
భార్య: శ్రీవాణి రెడ్డి
పిల్లలు: కుమార్తె పవిత్రా రెడ్డి, కుమారుడు ఆకర్ష్ రెడ్డి
స్వస్థలం: ఏఎం పుత్తూరు, శ్రీకాళహస్తి, గతంలో పదవులు: సిట్టింగ్ ఎమ్మెల్యే

సత్యవేడు



పేరు: రాజేష్ నూకతోటి
పుట్టిన తేది: 25-8-1970
విద్యార్హత: ఎంఏ
తల్లిదండ్రులు: హేమలత, గంగాధరం
భార్య: చైతన్య భాను
పిల్లలు: కుమారుడు వెంకట చరిత్ శ్రేయాన్
స్వస్థలం: వైకుంఠపురం,తిరుపతి
గతంలో పదవులు: కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి .

ప్రభావం చూపని అసమ్మతి

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి నేతలు ఎలాంటి ప్రభావాన్నీ చూపించలేకపోయారు. నగరి, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో బలమైన నేతలు వ్యతిరేకించినా రోజా, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యలకు అభ్యర్థులుగా అవకాశం లభించింది. దీంతో అసమ్మతి నేతలు అవమానకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నగరిలో మంత్రి రోజాను నాలుగేళ్ళుగా బలమైన వర్గం వ్యతిరేకిస్తోంది. ఆమెకు టికెట్ ఇవ్వకూడదని తరచూ అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చింది.టికెట్ ఇస్తే ఓడిస్తామని కూడా ఆల్టిమేటమ్ జారీ చేసింది. అయితే ఆమెను కాదని రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు కూడా తెచ్చుకోగలిగిన అసమ్మతి నేతలు రోజాకు టికెట్ రాకుండా మాత్రం అడ్డుకోలేకపోయారు.వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని అన్ని మండలాల్లోనూ ప్రజాబలమున్న నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేయద్దని, పోటీ చేసినా ఓడిపోతారని అధిష్ఠానానికి చెబుతూ వచ్చారు.అయినా పార్టీ ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించడంతో వ్యతిరేకించిన నాయకులకు సొంత మండలాల్లో తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. సూళ్ళూరుపేటలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే సంజీవయ్యను కూడా మండల స్థాయి బలమైన నేతలు పలువురు వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు మళ్లీ టికెట్ ఇవ్వకూడదని చాలాకాలంగా బహిరంగ కార్యకలాపాలు నడుపుతున్నారు. కాదని టికెట్ ఇస్తే ఓడిస్తామని పార్టీని హెచ్చరించినా అభ్యర్థిగా ప్రకటించడంతో వ్యతిరేకించిన నేతలు నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. సొంత మండలాల్లో అనుచరులకు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో సతమతమవుతున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను తీవ్రంగా వ్యతిరేకించిన అసమ్మతి వర్గాలు ఇపుడు ఎలా వ్యవహరించబోతున్నాయో అని రాజకీయ వర్గాలతో పాటు ప్రజానీకం కూడా ఆసక్తిగా వేచి చూస్తోంది.

అమల్లోకి ఎన్నికల నియమావళి

- ఆఫీసుల్లో నేతల ఫొటోలు... కూడళ్ళలో ఫ్లెక్సీల తొలగింపు
- విగ్రహాలకు ముసుగులు
- ప్రధాన పార్టీల్లో పెరిగిన హడావిడి



తిరుపతిలో నేతల విగ్రహాలకు ముసుగులు



తిరుపతిలో ఇంకా తొలగని జగన్ సిద్ధం ఫ్లెక్సీలు

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో జిల్లాలో సందడి పెరిగింది. అటు పార్టీలు, ఇటు యంత్రాంగం నిజానికి ఎన్నికలకు ఒకటి రెండు నెలలుగా సమాయత్తమవుతున్నాయి. కాకపోతే ఈసీ ముహూర్తం ప్రకటించడంతో అధికారికంగా ఎన్నికల వాతావరణం నెలకొంది. షెడ్యూలు వెలువడడంతోనే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం కోడ్ అమలుకు రంగంలోకి దిగింది. తొలుత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సీఎం జగన్ ఫొటోలను తొలగించారు. తిరుపతి నగరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అధికార పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు వంటి వాటిని తొలగించే పనిలో పడ్డారు. సగానికి పైగా కూడళ్ళలో తీసివేశారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి సన్నద్ధతను జిల్లా యంత్రాంగం సమీక్షించుకునే పనిలో పడింది. శనివారం రాష్ట్ర సీఈవో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాకు సంబంధించి ఎన్నికల విధులకు అందుబాటులో వున్న అధికారులు, ఉద్యోగుల సంఖ్యను, వారిలో ఏయే విధులకు ఎంత మందిని కేటాయించింది, రిజర్వులో వున్న వారి సంఖ్య వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడానికి నెలకు పైగా గడువున్న కారణంగా అధికార యంత్రాంగం ప్రతి అంశాన్నీ ఒకటికి రెండుసార్లు పునస్సమీక్షించుకునేందుకు అవకాశం ఏర్పడింది.మరోవైపు జిల్లాలో టీడీపీ అసెంబ్లీ స్థానాలకు, వైసీపీ అసెంబ్లీ సహా ఎంపీ స్థానానికి కూడా అభ్యర్థులను ప్రకటించేశాయి. జనసేన కూడా ఏకైక సీటుకు అభ్యర్థిని ఖరారు చేసింది. దీంతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులూ ప్రచారానికి శ్రీకారం చుట్టేశారు.అసంతృప్తులను బుజ్జగించేందుకు, ప్రత్యర్థి పార్టీల నుంచీ అసంతృప్త నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.32
సహరి (సోమవారం) : ఉ. 5.00

17.94 లక్షలకు చేరిన జిల్లా ఓటర్లు

- ఎన్నికల నిర్వహణకు రూ.9కోట్లు మంజూరు
- కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు
- చంద్రగిరి, తిరుపతిపై ప్రత్యేక దృష్టి

తిరుపతి(కలెక్టరేట్),మార్చి 16: ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. శనివారం షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ అమలు చేసే పనిలో పడింది. జిల్లాలో 2,130 పోలింగ్ కేంద్రాలుండగా మరో ఆరు పోలింగ్ కేంద్రాలకు అనుమతి కోసం ఈసీకి పంపారు. ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.14కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదన పంపగా మొదటి విడతగా రూ.9కోట్లు మంజూరయ్యాయి.జిల్లాలో ఎన్నికల నిర్వహణకు దాదాపు 17,650మంది ఉద్యోగులను అందుబాటులో ఉంచారు. నగదు, మద్యం, కానుకల పంపిణీని అడ్డుకోవడానికి 41ఎంసీసీ టీమ్‌లు,76 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ,29 వీడియో సర్వేలెన్స్ టీమ్స్ , 61 ఎఫ్ఎస్‌టీ టీములను నియమించారు.నేటినుంచి ఈ టీములు రంగంలో దిగనున్నాయి.జిల్లాలో ఓటర్ల సంఖ్య 17,94,604కు చేరింది. వీరిలో మహిళలు 9,19,760మంది, పురుషులు 8,75,076 మంది, ఇతరులు 177మంది ఉన్నారు. జనవరి 22న విడుదల చేసిన జాబితాలో ఓటర్ల సంఖ్యకన్నా 15,546మంది పెరిగారు.ఇందుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. జిల్లాలో 2,130 పోలింగ్ కేంద్రాలుండగా తిరుపతి, చంద్రగిరిల్లో ఆరుచోట్ల ఓటర్ల సంఖ్య 1500దాటడంతో అనుబంధ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఈసీకి ప్రతిపాదనలు పంపారు.తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో చోటు చేసుకున్న ఘటనలతో చంద్రగిరిలో ఇష్టానుసారం పోలింగ్‌కేంద్రాలను మార్చడం, దొంగ ఓట్లు విపరీతంగా నమోదు కావడంపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.మీడియాలో వచ్చే ఎన్నికల కథనాలను పర్యవేక్షించడానికి కలెక్టరేట్‌లో సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పెయిడ్ న్యూస్‌ను గుర్తించడానికి 30మందిని నియమించారు.



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

జేసీ బాధ్యతల స్వీకారం



ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 : జాయింట్ కలెక్టర్‌గా ధ్యానచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శుభం బన్సల్ శాప్ ఎండీగా బదిలీ అయిన విషయం విదితమే. ధ్యానచంద్రకు ఆర్డీవో పెంచలకిశోర్, ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, కలెక్టరేట్ ఏవో నరసింహారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందు వల్ల రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పాత నేరస్థులను బైండోవర్ చేసుకోవడం జరిగిందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. బహిరంగ సభలకు, ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కరుణ్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల

నాయుడుపేట టౌన్, మార్చి 16: ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో రాష్ట్రంలో రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మరో 45 రోజుల్లో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. ఓటు అనే ఆయుధం ద్వారా ప్రజలు సీఎం జగన్‌ను ఇంటిని పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జగన్‌కు ఓటు వేయవద్దని సొంత చెల్లెళ్లే చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, ప్రభాకర్‌నాయుడు, శ్రీనివాసులు, సురేష్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో

పెళ్లకూరు, మార్చి 16: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నాయుడుపేట ఐసీడీఎస్ సీడీపీవో కొండ్రెడ్డి ఉమామహేశ్వరి అన్నారు. శనివారం తాళ్వాయిపాడు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న చిరుధాన్యాల ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను చేర్చుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, సిబ్బంది స్వరూపరాణి, ఉష, ఆదెమ్మ తదితరులు ఉన్నారు.

టీడీపీ విజయం తథ్యం: విజయశ్రీ



టీడీపీలో చేరిన వారితో విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 16: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం పెళ్లకూరు మండలం పునబాక గ్రామానికి చెందిన 22 మంది వైసీపీ యువత టీడీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ప్రచారం సందర్భంగా నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం మధునాయుడు, సిద్ధం నాయుడు, యుగంధర్‌గౌడ్, హరిబాబునాయుడు, పునబాక పోలయ్య, నెలవల రాజేష్, పరుశురాం, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై దౌర్జన్యం ఆపాలి

వెంకటగిరిటౌన్, మార్చి 16: గిరిజనులపై దౌర్జన్యం ఆపాలని సీపీఎం వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పెట్లూరులో భూ సాధన పోరాటం చేస్తున్న గిరిజనులను పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. సర్వే నెం. 12.1 ఉన్న 519 ఎకరాల పోరంబోకు భూమిని గిరిజనులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గోపాలయ్య, రమణయ్య, గురవయ్య, కోటీశ్వరరావు, వెంకటరమణయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రాంకుమార్ రెడ్డి గెలుపునకు కృషి చేయండి

బాలాయపల్లి, మార్చి 16: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలోని సుబ్రమణ్యస్వామి, అలిమిలి పంచాయతీలోని కనుమరాయకొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యం గ్రామంలోని వైసీపీ నాయకులు సర్వేపల్లి సురేష్, లోకనాయుడు ఇళ్లకు వెళ్లి తన కుమారుడు రాంకుమార్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

పరిశ్రమ నుంచి వ్యర్థాల విడుదల

పాలచ్చూరు పంచాయతీవాసుల ఆందోళన

పెళ్లకూరు, మార్చి 16: మండలంలోని పాలచ్చూరు పంచాయతీ సమీపంలో ఏర్పాటు చేసిన ఓ పరిశ్రమ నుంచి వదులుతున్న రసాయనిక వ్యర్థాలతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పరిశ్రమ నుంచి కాలువలోకి వస్తున్న వ్యర్థాలను పాలచ్చూరు గ్రామానికి చెందిన మద్దాల కీర్తికిరణ్‌రెడ్డితో పాటు మరికొంత మంది గ్రామస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరిశ్రమ ఉద్యోగుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కీర్తికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ వ్యర్థాలను కాలువలోకి వదిలేయడంతో అవి తాగునీరందించే బోరుపాయింట్ల వద్దకు చేరుతున్నాయని, దీంతో తాగునీరు రంగు మారి కలుషితమవుతోందన్నారు. పరిశ్రమ యాజమాన్యం నింబధనలు పాటించకుండా రసాయన వ్యర్థాలను విచ్చలవిడిగా వదిలేస్తోందని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ వాకాడు డిపో మేనేజర్ మృతి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 16: ఆర్టీసీ వాకాడు డిపో మేనేజర్ ఎస్.మధుశేఖర్‌రెడ్డి శనివారం గుండెపోటుతో స్విమ్స్ ఆస్పత్రిలో మృతి చెందారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మధుశేఖర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

వంట నూనెల దుకాణంలో చోరీ

నాయుడుపేట టౌన్, మార్చి 16: పట్టణంలోని ఓ వంట నూనెల దుకాణంలో చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... రామకృష్ణాపురంలో ఆయిల్ దుకాణం యజమాని వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం దుకాణం వద్దకు రాగా షెట్టర్ తొలగించి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దుకాణంలలో ఉన్న రూ.20వేల నగదు, రూ.11వేల విలువచేసే ఆయిల్ ప్యాకెట్లు, ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలలో దుండగులు ప్రవేశించి చోరీ చేస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ రాక్షస పాలనకు సమాధి: లక్ష్మీసాయిప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, మార్చి 16: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తండ్రితో కలిసి మాట్లాడారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు సీఎం జగన్‌ను ఇంటికి పంపేందకు సిద్ధంగా ఉన్నారని, మరో 45 రోజుల్లో సైకో పాలన నుంచి జనానికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో వనరులను దోచుకోవడంతో సరిపెట్టుకొన్నారే తప్ప అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, శ్రీరామదాసు గంగాధర్, పునుగోటి విశ్వనాధ నాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, గల్లా శ్రీనివాసులు, చంగారావు తదితరులు పాల్గొఉన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



లోక్‌అదాలత్‌లో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, మార్చి 16: రాజీ మార్గమే రాజమార్గమని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న గొడవలతో కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరగడం వల్ల డబ్బు, సమయం వృధా అవుతుందన్నారు. రాజీ అయ్యే కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరువర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కాగా, లోక్‌అదాలత్‌లో 32 సివిల్, 187 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీధర్, బీవీ సులోచనారాణి, లోకనాథం, న్యాయవాదులు చంద్రశేఖర్, కోటేశ్వరరావు, గోపీకృష్ణ, అరవ పార్వతయ్య, మెహబూబ్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ జరిగింది. ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లోకనాథం ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు సంబంధించి క్రిమినల్ కేసు 28, బ్యాంక్ కేసులు 11, ఎస్‌టీసీ అడ్మిషన్ కేసులు 18 పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ కేదార్‌నాథ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 40 కేసులను పరిష్కరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ధర్మాప్రసాద్, శ్రీరాముల యాదవ్, గణపతి, లక్షమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరుణ్‌బోస్ తదితరులు

వెంకటగిరిటౌన్, మార్చి 16: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక వీర్లచావడి వద్దనున్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జోన్ చైర్మన్ ఉప్పల సునీత చేతుల మీదుగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు నిర్మకుమారి, సభ్యులు త్రిపుర, కళావతి, జ్యోత్స్న, రాపూరి బాలసుబ్రమణ్యం, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్థానిక ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ మీటర్ల రీడర్లపై వేధింపులు ఆపాలి

నాయుడుపేట, మార్చి 16: ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ల రీడర్లపై అధికారుల వేధింపులు ఆపాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ హజరత్‌వలి అన్నారు. శనివారం నాయుడుపేట ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం వద్ద మీటర్ రీడర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. కరెంట్ వినియోగానికి రీచార్జ్ సిస్టమ్ రానున్న దృష్ట్యా మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు కంట్లాం లక్ష్మణ్, మాసారం కృష్ణంరాజు, మురళీ, బాబు, వంశీ, ప్రసాద్, భరత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన ఆధునికీకరణకు రూ.30 లక్షలు

నాయుడుపేట, మార్చి 16: నాయుడుపేటలోని అంబేడ్కర్ భవనాన్ని రూ.30 లక్షలతో ఆధునికీకరించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. శనివారం అంబేడ్కర్ భవనం ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, న్యాయవాది పేర్నాటి వెంకటేశ్వర్లు, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, దారా రవి, చేవూరి చెంగయ్య, రత్నశ్రీ, చదలవాడ కుమార్, కరీంబాయి చెంచయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్

వెంకటగిరి, మార్చి 16: వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న రవికుమార్ పదోన్నతిపై వెంకటగిరికి వచ్చారు.

మహాకూటమిదే విజయం

దొరవారిసత్రం, మార్చి 16: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీ అన్నారు. దొరవారిసత్రం మండలం వెదురుపట్టు పంచాయతీ తుంగమడుగు గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌తో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, నెలవల రాజేష్, దార్ల రాజేంద్ర, మనోహర్‌రెడ్డి, మాధవనాయుడు, జక్కరయ్య, బాలసుబ్రహ్మణ్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి, మార్చి 16: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నా క్యాంటీన్ ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ తెలిపారు. శనివారం కురుగొండ్ల రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ వద్ద ఉచిత భోజనాన్ని ఆమె తన తండ్రి కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ప్రజలకు వడ్డించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ పునుగోటి విశ్వనాధం నాయుడు కైవల్యానదీ తీరంలో కొత్తగా నిరించిన డాక్టర్ శిరీష్ డెంటల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు.

బీవీపాళెం చెక్‌పోస్టులో ఎస్పీ తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్

తడ, మార్చి 16: భీములవారిపాళెంలో చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ శనివారం తనిఖీ చేశారు. తడకు వచ్చిన ఆయన నేరుగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ట్రైనీ ఎస్పీ దేవరాజ్‌మనీష్ పాటిల్, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహరావు తదితరులు ఉన్నారు.

జనారణ్యంలోకి జింక

సూళ్లూరుపేట, మార్చి 16: సూళ్లూరుపేటలో షార్ ఉద్యోగులు నివాసం ఉండే డీవోఎస్ కాలనీలో శనివారం జింక సంచరించింది. ఉద్యోగులు జింకను సురక్షితంగా పట్టి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి అటవీప్రాంతంలో విడిచిపెట్టారు. జింకకు తేలికపాటి గాయాలు ఉండటంతో కాలనీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, ఉద్యోగులు సూర్యతేజ, వెంకటయ్య శశికుమార్ గాయానికి చికిత్స చేసి షార్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు.

ఇరకంకుప్పం వాసులకు పూడికుప్పంలో ఇళ్లస్థలాలు

తడ, మార్చి 16: ఇరకంకుప్పం వాసులకు పూడికుప్పం గ్రామంలో ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారని ఇరకంకుప్పం గ్రామస్తులు తెలిపారు. శనివారం పూడికుప్పంలోని ప్రతిపాదిక స్థలంలో ఇరకంకుప్పం గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 300 కుటుంబాలకు స్థలాలు కేటాయించేందుకు అధికారులు అంగీకరించారకని, ఇందుకోసం 8 ఎకరాల భూములను సిద్ధం చేశారన్నారు. సమావేశంలో ఆర్ రత్నం, వాసు మొదలియార్, తిరుమల్‌రెడ్డి, శీనుమొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, మార్చి 16: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు జరిగాయి. ఉదయం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రికి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఫ్లెక్సీల తొలగింపు

నాయుడుపేట టౌన్, మార్చి 16: కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని పలు కూడళ్లలో రాజకీయపార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శనివారం సాయంత్రం తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల చిత్రపటాలను తొలగించారు.

టీడీపీకి వేనాటి రామచంద్రారెడ్డి రాజీనామా



తడ/సూళ్లూరుపేట, మార్చి 16: టీడీపీ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. శనివారం సాయంత్రం సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ కుటుంబం 1982 నుంచి టీడీపీలో కొనసాగిందని, 2014 నుంచి తమకు అవమానాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరుగుతున్న అవమానాలను చూసి కొడుకు 2018లో టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరాడని, అయినా తాను మాత్రం పార్టీ కొనసాగానని చెప్పారు. కొందరు స్వార్థపరులు తనకు, చంద్రబాబుకు మధ్య దూరం పెంచారని తెలిపారు. నారా లోకేశ్ పాదయాత్ర సమయంలోనూ అవమానాలు ఎదురయ్యాయని, కనీస గౌరవంలేని పార్టీలో కొనసాగలేక టీడీపీకి రాజీనామ చేస్తున్నట్లు ప్రకటించారు.

చంద్రబాబుతోనే యువత భవిత



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం జశ్వంత్‌కుమార్

గూడూరు, మార్చి 16: యువతకు మంచి భవిష్యత్తు ఉండాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కుమారుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో శంఖారావం- సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. చంద్రబాబునాయుడు ఐటీ రంగాన్ని అభివృద్ధి పరిచి ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. విజన్ గల నాయకుడిని ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే యువతకు భవిష్యత్తు ఉంటుందన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బత్తిని ప్రణీత్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



పరీక్షా సామగ్రి అందజేస్తున్న టీడీపీ నాయకుడు కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 12: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి అన్నారు. పెళ్లకూరు మండలం శిరసనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల కోసం ప్యాడ్‌లు, జామెంటరీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర పరీక్షా సామగ్రి కేఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు రమణయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నీరజ, సుభాష్ తదితరులు ఉన్నారు.

చేయూత చెక్కుల పంపిణీ

కోట, మార్చి 16: మండలంలోని 3,648 మందికి రూ.6.84 కోట్ల చేయూత చెక్కులను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పంపిణీ చేశారు. కోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య, వైసీపీ నేతలు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, నరమాల రమణయ్య, మధుసూదన్‌రెడ్డి, మోబిన్‌బాషా, నాగూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వర ఆలయాలలో పూజలు

కోట, మార్చి 16: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీలక్ష్మమ్మకాలనీ, గూడలిలోని ఆలయాల్లో ప్రధానార్చకులు వెంకటేశ్వరస్వామి విగ్రహాలకు పలు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

పెళ్లకూరు, మార్చి 16: మండలంలోని చిల్లకూరు పెళ్లకూరు దిగువ చావిఆలి, శిరసనంబేడు గ్రామాల్లో శనివారం ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు.

నేడు గ్రూప్-1 పరీక్ష

16 కేంద్రాల ఏర్పాటు ● హాజరుకానున్న 9,377 మంది

తిరుపతి(విద్య), మార్చి 16: గ్రూప్-1 పరీక్షను ఆదివారం తిరుపతిలోని పలు సెంటర్లలో నిర్వహించనున్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9,377 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పేపర్-1, పేపర్-2 విధానంలో రెండు దఫాలుగా పరీక్ష జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 9 నుంచి 9.45 గంటల లోపే పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఇక మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్న పేపర్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.45 గంటల లోపు కేంద్రంలోకి చేరుకోవాలి. హాల్‌టికెట్‌తోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ తదితర గుర్తింపు కార్డులను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అభ్యర్థులు సమాచారం కోసం 90006 65565, 96769 28804లలో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు.

రేపటి నుంచి రీసెర్చ్ మెథడాలజీపై కోర్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16: ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలో రీసెర్చ్ మెథడాలజీపై వారం పాటు ప్రత్యేక కోర్సు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఈ కోర్సును ప్రారంభించనున్నారు. పరిశోధనా విధానంపై పీహెచ్‌డీ స్కాలర్లకు అవగాహన కల్పిస్తారు. ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన పీహెచ్‌డీ స్కాలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరారు. ఈ మేరకు వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపాల్ శ్యాంమోహన్‌డేవిడ్‌రాజు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ప్రకటించింది.

నేషనల్ ఇన్‌స్పైర్‌కి మూడు ప్రాజెక్టుల ఎంపిక



తిరుపతి(విద్య), మార్చి 16 : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్‌లో జాతీయ స్థాయికి 24 ప్రాజెక్టులు ఎంపిక కాగా ఇందులో జిల్లాకు చెందినవి మూడు ఉన్నట్లు తెలిపారు. దొరవారిసత్రం మండలం కల్లూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి వి.నిరూష రూపొందించిన ట్రోలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్, రామచంద్రాపురం మండలం కమ్మపల్లె గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థి ఎం.వాణి రూపొందించిన కోకోనట్ డ్రిల్లర్ అండ్ బ్రేకర్, రేణిగుంట మండలం గుత్తివారిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి గొల్లపల్లి రేష్మ రూపొందించిన బాయిల్డ్ ఎగ్ సెల్ పీలర్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వివరించారు. గైడ్ టీచర్లుగా పీవీ రమణయ్య(కల్లూరు జెడ్పీహెచ్‌ఎస్), ఎస్‌జే కామేశ్వరి (జీహెచ్‌ఎస్, కమ్మపల్లె), పి.మునిరెడ్డి(జెడ్పీహెచ్‌ఎస్, గుత్తివారిపల్లె) వ్యవహరించారని తెలిపారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్ విద్యార్థులతో కలసి జేసీ ధ్యానచంద్రని మర్యాద పూర్వకంగా కలిశారు.

తిరుపతి వెళ్లే మెమో రైళ్లు పాక్షిక రద్దు

పెరంబూర్, మార్చి 16: స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్, విల్లుపురం, అరక్కోణం నుంచి తిరుపతి వెళ్లే మెమో సబర్బన్ రైళ్లను ఆది, సోమవారాలు (ఈనెల 17, 18 తేదీలు) పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ● నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 9.50 గంటలకు బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, నెం.06728 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.35 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతుంది. ● నెం.16854 విల్లుపురం నుంచి ఉదయం 5.35 గంటలకు తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే నెం.16853 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా కాట్పాడి నుంచి బయల్దేరుతుంది. ● నెం.06753 అరక్కోణం నుంచి ఉదయం 9.15 గంటలకు తిరుపతికి బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు నడుస్తుంది. నెం.06754 తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు అరక్కోణం బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతుంది.